# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక




చురుగ్గా నైరుతి రుతుపవనాలతో
ఆంధ్రలో మూడు రోజులు వర్షాలు

2 లో..


అమలాపురం | సంపుటి : 10 సంచిక : 104 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | బుధవారం 04 జూన్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 104 04-06-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


### తెలుగు రాష్ట్రాల్లో.. సెక్స్ వర్కర్లు

# ఎక్కువేనట..

- సెక్స్ వర్కర్లలో.. కర్నాటక టాప్
- రెడ్ లైట్ హాట్ స్పాట్‌లో తెలంగాణకే ప్రథమం
- ఏపీ సెకండ్
- తాజా అధ్యయనంలో వెల్లడి



దేశవ్యాప్తంగా సెక్స్ వర్కర్ల సంఖ్య భారీగా పెరుగుతోందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. మహిళా సెక్స్ వర్కర్లు అధికంగా ఉన్న రాష్ట్రాల్లో తెలుగు రాష్ట్రాలు మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయని తేల్చింది. ఈ మేరకు ప్రోగ్రమాటిక్ మ్యాపింగ్ అండ్ పాపులేషన్ సైజ్ ఎస్టిమేషన్ (పీఎంపీఎస్ఈ) విడుదల చేసిన నివేదిక ప్రకారం.. భారతదేశంలో మహిళా సెక్స్ వర్కర్ల సంఖ్య 9,95,499 గా ఉందని అంచనా. ఈ జాబితాలో 15.4 శాతం సెక్స్ వర్కర్లతో కర్ణాటక మొదటి స్థానంలో ఉండగా ఆ తర్వాతి స్థానంలో ఆంధ్రప్రదేశ్ (12.0%), మూడో స్థానంలో మహారాష్ట్ర (9.6%), నాలుగో స్థానంలో ఢిల్లీ (8.9%), టాప్ ఫైవ్ లో తెలంగాణ (7.6%) ఉన్నాయి. దేశంలోని మొత్తం మహిళా సెక్స్ వర్కర్లలో 53% మంది ఈ ఐదు రాష్ట్రాల్లోనే ఉన్నట్లు పీఎంపీఎస్ఈ నివేదిక పేర్కొంది. ఇక, రెడ్ లైట్ హాట్‌స్పాట్‌లలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. సాంద్రత పరంగా ఒక్కో హాట్‌స్పాట్‌లో సగటున 38 మంది సెక్స్ వర్కర్లు ఉన్నారని తెలిపింది. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానంలో ఉందని పేర్కొంది.

# విజృంభిస్తోంది..

- 24 గంటల వ్యవధిలో ఐదుగురి మృతి
- దేశవ్యాప్తంగా 4,026 దాటిన యాక్టివ్ కొవిడ్ కేసులు
- కేరళలో అత్యధికంగా 1416 యాక్టివ్ కేసులు నమోదు
- పెరుగుతున్న మరణాలు
- ప్రస్తుత ఉధృతికి ఒమిక్రాన్ సబ్ వేరియంట్లే కారణమని ఐసీఎంఆర్ వెల్లడి
- ప్రస్తుత వేరియంట్లు తీవ్రమైనవి కావు, ఆందోళన వద్దు, అప్రమత్తత చాలన్న నిపుణులు





**దేశంలో కరోనా వైరస్ మరోసారి కలకలం సృష్టిస్తోంది. యాక్టివ్ కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటంతో పాటు మరణాలు కూడా నమోదవుతున్నాయి. మంగళవారం నాటికి దేశవ్యాప్తంగా యాక్టివ్ కొవిడ్-19 కేసుల సంఖ్య 4 వేల మార్కును దాటింది. గడిచిన 24 గంటల్లో ఐదుగురు ఈ మహమ్మారికి బలయ్యారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ప్రస్తుతం దేశంలో మొత్తం 4,026 యాక్టివ్ కొవిడ్ కేసులు ఉన్నాయి.**

దేశంలో నమోదవుతున్న కేసుల్లో కేరళ అగ్రస్థానంలో కొనసాగుతోంది. మంగళవారం ఒక్కరోజే కేరళలో 171 కొత్త కేసులు వెలుగుచూడగా, రాష్ట్రంలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 1,416కి చేరింది. దేశ రాజధాని ఢిల్లీలోనూ కొవిడ్ కేసుల సంఖ్యలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. కొత్తగా 124 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారణ కావడంతో, ఢిల్లీలో యాక్టివ్ కేసుల సంఖ్య 393కు పెరిగింది. మహారాష్ట్రలో తాజాగా 69 కొత్త కేసులు నమోదవగా, అక్కడ యాక్టివ్ కేసుల సంఖ్య 494కు చేరింది. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా 11 కేసులు నమోదు కాగా, ఆ రాష్ట్రంలో యాక్టివ్ కేసుల సంఖ్య 372గా ఉంది.

**ఐసీఎంఆర్ వివరణ**

దేశంలో, ముఖ్యంగా దక్షిణ, పశ్చిమ భారత రాష్ట్రాల్లో కొవిడ్ కేసుల పెరుగుదలకు ఒమిక్రాన్ సబ్ వేరియంట్లే కారణమని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ రాజీవ్ బహల్ సోమవారం ధృవీకరించారు. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న ఈ సబ్ వేరియంట్లు తీవ్రమైనవిగా వర్గీకరించబడలేదని ఆయన స్పష్టం చేశారు. "మేము పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నాము. ప్రస్తుతానికి, ప్రజలు పరిస్థితిని గమనిస్తూ, అప్రమత్తంగా ఉండాలి కానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని రాజీవ్ బహల్ తెలిపారు. నిపుణుల సూచనల మేరకు తగిన జాగ్రత్తలు పాటిస్తూ, కొవిడ్ వ్యాప్తిని అరికట్టడంలో ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# రెండో వాడికి పెళ్లి.. మీ అశీస్సులు కావాలి

### చంద్రబాబుకు నాగార్జున ఆహ్వానం

అమరావతి జూన్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సినీ నటుడు అక్కినేని నాగార్జున తన రెండో కుమారుడు అఖిల్ వివాహానికి అహ్వాన పత్రికను అందించారు.. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎంను నేడు నాగార్జున కలిశారు. తన కుమారుడు, యువ హీరో అక్కినేని అఖిల్ వివాహానికి హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రిని ఆయన వ్యక్తిగతంగా కోరారు. ఈ సందర్భంగా వివాహ ఆహ్వాన పత్రికను చంద్రబాబుకు నాగార్జున అందజేశారు. ప్రస్తుతం అక్కినేని కుటుంబంలో పెళ్లి సందడి నెలకొంది. అఖిల్ వివాహం ఈ నెల 6వ తేదీన హైదరాబాద్ జరగనుంది.

### నడిరోడ్డుపై దళిత, ముస్లిం యువకులను కొట్టే హక్కు

# పోలీసులకు ఎవరిచ్చారు..?

- వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆగ్రహం
- తెనాలిలో పోలీసుల చేతిలో హింసకు గురైన యువకుల కుటుంబాలకు వైయస్ జగన్ పరామర్శ
- నేడు రాష్ట్రవ్యాప్తంగా వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నాం
- ప్రతీ ఒక్కరూ ఈ నిరసనల్లో పాల్గొనాలి : వైయస్ జగన్ జగన్ పిలుపు







తెనాలి, జూన్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

నడిరోడ్డుపై దళిత, ముస్లిం యువకులను కొట్టే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. పోయిన ఆ కుటుంబాల పరువును ఎవరు తీసుకొస్తారని ఆయన నిలదీశారు. కేసులు ఎవరి మీదా అయినా ఉండొచ్చు. ఆ వ్యహారాన్ని కోర్టులు చూసుకుంటాయని, చంద్రబాబుపై 24 కేసులున్నాయని నడిరోడ్డు మీదకు తీసుకొచ్చి తన్నడం ధర్మమేనా? అని ప్రశ్నించారు. పోలీసులే చట్టాన్ని ఉల్లంఘిస్తారా?. ఇలా చేసే నైతికత

- తరువాయి 2లో..

# తెనాలిలో జగన్‌కు నిరసన సెగ

**తెనాలిలో జగన్ పర్యటనలో ఉద్రిక్తత**

**ఆయన పర్యటనపై దళిత, ప్రజా సంఘాలు నిరసన**

**ఐతా నగర్‌లో రౌడీ షీటర్లను పరామర్శించడానికి వస్తున్నారంటూ అభ్యంతరం**

గుంటూరు జూన్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గుంటూరు జిల్లా తెనాలిలో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ పర్యటనలో ఉద్రిక్తత నెలకొంది. ఆయన పర్యటనపై దళిత, ప్రజా సంఘాలు నిరసన తెలిపాయి. ఐతా నగర్‌లో రౌడీ షీటర్లను

- తరువాయి 2లో..



### ఆల్ టైమ్ రికార్డ్... హైదరాబాద్‌లో

# రూ.1 లక్ష దాటిన బంగారం ధర

**హైదరాబాద్‌లో రికార్డు స్థాయికి చేరిన బంగారం ధరలు**

**మధ్యాహ్నం 12 గంటలకు రూ.1,00,110కి చేరిన తులం బంగారం**

**ఏప్రిల్ 22 నాటి రికార్డును అధిగమించిన పసిడి**

హైదరాబాద్ జూన్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

హైదరాబాద్ నగరంలో బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర ఏకంగా రూ.1,00,110 కి చేరింది. ఇది బంగారం ధరల చరిత్రలోనే అత్యధికమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల అని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర



- తరువాయి 2లో..

### తుని రైలు దహనం కేసు..

# రీ ఓపెన్‌కు ప్రభుత్వం రెడ్ ఫ్లాగ్..

అమరావతి జూన్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తుని రైలు దహనం కేసు లో అప్పీల్ వెళ్లనుందనే వార్తల నేపథ్యంలో కూటమి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసును రీ ఓపెన్ చేసే అలోచన లేదని తేల్చి చెప్పింది.. అప్పీల్ కోసం విడుదల చేసిన ఉత్వర్వులను కొట్టి వేస్తూ నేడు ప్రభుత్వ మరో జీవోను విడుదల చేసింది.. వాస్తవంగా అప్పీల్ కు విడుదల చేసిన జీవోపై పూర్తి వివరాలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం కోరింది.. కాగా, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం కాపులను బీసీల్లో

- తరువాయి 2లో..



https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

## సంపాదకీయం

# 'మేఘ' గర్జన

'బాంబుల పొగ, దు:ఖపు సెగ' ఏడాదిన్నరగా పాలస్తీనా కథ ఇది. ఈ కథకు కారాణాలను ప్రశ్నించిందా విద్యార్థిని. ఈ విధ్యంసానికి మన మద్దతు ఎందుకు అని గర్జించింది. ఆ వికృత గీతానికి మనం ఎందుకు స్వరాలు కూర్చటమని నిలదీసింది. పాలస్తీనా మాటెత్తితే చాలు, ఏకంగా యూనివర్సిటీలపైనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్కుపాదం మోపుతున్న వేళ.. భారత సంతతి విద్యార్థిని మేఘ వేమూరి అదే అమెరికా నడిబోడ్డున నిజాలను నిగ్గదీసింది. కేంబ్రిడ్జ్‌లోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) గ్రాడ్యుయేషన్ సెర్మీన్ వేదిక నుంచి ఏకంగా పాలస్తీనాకు మాటలతోనే కాదు, రూపంతో కూడా సంఘీభావంగా నిలిచింది. పాలస్తీనా అంతటా కమ్ముకున్న కారుమబ్బులను చీలుస్తూ ఆమె మాటలు తూటాల్లా తాకాల్సిన వారికి గట్టిగానే తాకాయి. ఇప్పుడు ఆ ధిక్కార స్వరం ప్రపంచమంతటా ప్రతిధ్వనిస్తోంది. అందుకే ఆగమేఘాల మీద ఆమెపై చర్యలకు ఉపక్రమించారు.

'విస్తరించిన మౌనాలు ప్రేక్షక పాత్ర వహిస్తున్న కాలంలో, ఆకృత్యాలు రక్తమోడు తూనే ఉన్నాయి. గుండెలన్నీ చుట్టూ ఉన్నా కొట్టుకోవటం మరచిపోయాయా! అమానవీయతను చుట్టుకు న్నాయా?' అని ఆవేదన చెందుతాడోకవి. నిజమే, మన కండ్లముందు జరగకూడనివి, దుర్మార్గమైనవి జరుగుతున్నప్పుడు మౌనంగా ఎలా ఉండగలం! మౌనంగా ఉండి మనుషులం ఎలా కాగలం! ఈ మౌన సంస్కృతిని ఛేదించకపోతే మారాలని కోరుకుంటున్న సమాజం ఎలా మారుతుంది. మనుషులు ఇంత శక్తి హీనంగా చైతన్య రహితంగా ఎందుకు మారారు? ఇదే రేపు మనకూ ఎదురైతే! మనదాకా వచ్చినప్పుడు ఎవరుంటారు, ఎవరింటారు! మనల్ని మనం వెన్నుపై చరచుకుని మెలుకువ తెచ్చుకోవాల్సిన సమయం ఇది. ఇప్పుడు ఆ వెన్ను చరిచే పనే మేఘా చేసింది.

"పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడికి అమెరికా మాత్రమే కాదు, మన యూనివర్సిటీ కూడా సాయం చేస్తోంది. వాటిని ప్రోత్సహిస్తోంది" అంటూ ఆమె కమెన్స్‌మెంట్ సెర్మనీ వేదికగా కుండబద్దలు కొట్టింది. ఏ మాత్రం బెరుకు లేకుండా "ఎంఐటీ విద్యార్థులు స్వేచ్ఛాయుత పాలస్తీనాను కోరుకుంటున్నారు. ఒక జాతి విధ్వంసాన్ని విద్యార్థులు సహించలేరు. మా జీవితాలను శాస్త్రవేత్తలుగా, ఇంజనీర్లు, విద్యావేత్తలు, నాయకులుగా తీర్చిదిద్దుకుంటాం. అలాగే ఆయుధ నిషేధానికి పిలుపునిచ్చేందుకు కూడా మేం అంతే కట్టుబడి ఉన్నాం. ఎంఐటీ విద్యార్థులుగా ఇజ్రాయిల్‌తో సంబంధాలను తెంచుకోవాలని వర్సిటీని డిమాండ్ చేస్తూనే ఉంటాం" అంటూ మేఘంలా గర్జించింది. అమెరికా ఇజ్రాయిల్ విద్యావ్యవస్థల ద్వంద్వ స్వభావాన్ని మేఘా ప్రపంచం ముందు ఎండగట్టింది. క్రమక్రమంగా కోల్పోతున్న ప్రపంచ ఆధిపత్యాన్ని తిరిగి పొందడానికి అమెరికా అధ్యక్షుడు బరితెగిస్తూ విపరీత చర్యలు ప్రకటిస్తుంటే, అదే గడ్డపై నిలిచి అమెరికా విద్యాల యాల పరిశోధనలు ఇజ్రాయిల్ హింసోన్మాదానికి ఎలా సహకరిస్తున్నాయో ఎలుగెత్తి ప్రపంచానికి చాటడం చిన్న విషయం కాదు. విశ్వగురువు సైతం జీ హుజూర్ అంటూ సాకిలపడిన కొండను ఢకొట్టింది మేఘా వేమూరి. తన వ్యక్తిగత భవిష్యత్తును ఫణంగా పెట్టి మరీ ఆమె ఈ సాహసానికి పూనుకుంది.

ప్రస్తుతం అమెరికా వ్యాప్తంగా విద్యాసంస్థలపై అనిశ్చితి చీకట్లు కమ్ముకున్నాయన్నది బహిరంగ రహస్యమే. తర్వాత ఏం జరగనుందనే అందరి మనస్సులోని ప్రశ్నలకు ఆమె ప్రతి రూపమై ధ్వనిస్తోంది. విద్యాలయాల్లో భిన్న దృక్పథాలు, ప్రశ్నించేతత్వం లేకుండా విజ్ఞానం వికసించదు. కళ్లెదురుగా జరుగుతున్న దుర్మార్గాలను, అన్యాయాలను, వాటి మూలాలను పరిశోధించడం, తమ అభిప్రాయాలను స్పష్టంగా ప్రకటించడం విద్యకు ఉండాల్సిన ప్రాథమిక లక్షణాలని మేఘా అభిప్రాయం. అదే నేడు ఆచరణలో చూపింది. ఆ మాత్రపు ప్రశ్నను కూడా ప్రపంచంలోని అనేక దేశాధినేతలు, వారి అనుయాయులు సహించలేకపోవడం, వణికిపోవడం వారి భయాందోళనలనే సూచిస్తోంది. కొద్ది నెలల క్రితం అమెరికాలోని ప్రిన్‌టన్ యూనివర్సిటీలో పాలస్తీనాకు సంఘీభావంగా ప్రదర్శనలో పాల్గన్న నూట పది మంది విద్యార్థులను అరెస్టు చేసిన విషయం ఆమెకు తెలియనిదేమీ కాదు. అయినా వెరువని ధీర ఆమె. యేటికి ఎదురీదేవాళ్లు కొందరుంటారు మేఘాలా. వాళ్లు తామెంతగా నష్టపోయినా, ఎన్ని ఇక్కట్లకు గురయినా, ఎన్ని సవాళ్లు ఎదురయినా విలువల అడుగులపైనే నిలబడి ఉంటారు. వారు అరుదుగా కనిపించవచ్చు. కానీ, అలాంటి వాళ్లే నేడు సమాజానికి అవసరం.

'తను వేదికపై తెలిపింది నిరసన కాదు నిజాన్ని' అని మరింత గట్టిగా చెబుతుంది. జెనోసైడ్‌లో పాలుపంచుకున్న సంస్థ వేదికపై నేను నడవడానికి కూడా ఇష్టపడటం లేదని సూటిగా స్పష్టంగా తేల్చి చెప్పింది. ప్రశ్నించడం రాని చదువుకు పదునుండదు. సత్యం ధ్వనించని శబ్దంలో శక్తి నిండదు. కాబట్టే స్వేచ్ఛా స్వరాలు తమ దారిని తాము వెతుక్కుంటాయి. ముళ్లూ రాల్లూ ఎన్నున్నా ముందుకుపోయే అడుగులుంటాయి. అలాంటి అడుగే మేఘా వేమూరి వేసింది

## చురుగ్గా నైరుతి రుతుపవనాలతో

# ఆంధ్రలో మూడు రోజులు వర్షాలు

**అమరావతి జూన్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు సక్రమంగా విస్తరిస్తున్న నేపథ్యంలో, వచ్చే మూడు రోజులు వర్షాల కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలపై నైరుతి మేఘాల ప్రభావం ప్రారంభమై, పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు ఇంకా మూడు రోజులు కొనసాగనున్నట్లు అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.



**రుతుపవనాల ప్రభావం ఏమిటి?**

నైరుతి రుతుపవనాలు సాధారణంగా జూన్ ప్రారంభం నుండి దేశంలోని పెద్దభాగంలో వర్షాలను తీసుకువస్తాయి. ప్రస్తుతం ఈ గాలులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మీదుగా చురుగ్గా ప్రవహిస్తున్నాయి. వీటి వలన తేమ గాలులు రాష్ట్రంలోకి ప్రవేశించి వర్షాలుకు కారణమవుతున్నాయి.

**ప్రాంతాల వారీగా వాతావరణ సూచన:**

**ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ %డ% యానాం:**

ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే మూడు రోజులు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేసింది. ఆంధ్ర ప్రదేశ్ %-% యానంలో దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి %-% పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు ఈ కింది విధంగా ఉన్నాయి. మంగళవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశముంది. బలమైన ఈదురు గాలులు గంటకు 30-40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. వేడి, తేమతో కూడిన అసౌకర్యమైన వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. బుధవారం, గురువారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు బలమైన ఈదురు గాలులు గంటకు 30-40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. వేడి, తేమతో కూడిన అసౌకర్యమైన వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది.

**రాయలసీమ:** మంగళవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశముంది. బలమైన ఈదురు గాలులు గంటకు 30-40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. **బుధవారం %డ% గురువారం:** ఉరుములతో కూడిన వర్షాలు, మెరుపులు, బలమైన గాలులు కొనసాగే సూచనలు. గంటకు 30-40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచవచ్చును. తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశముంది.

# ఏఐ ఎఫెక్ట్... టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌లో మళ్లీ ఉద్యోగాల కోత

### కొన్ని వారాల క్రితమే 3 శాతం మంది ఉద్యోగుల తొలగింపు - రెడ్‌మండ్‌లో తాజాగా 305 మంది ఉద్యోగులపై వేటు

### పనితీరు కారణం కాదన్న మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల



ప్రముఖ టెక్నాలజీ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 3 శాతం మంది ఉద్యోగులను తగ్గించిన కొన్ని వారాల్లోనే, ఇప్పుడు మరికొంత మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సంస్థాగత పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఈ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది.

వాషింగ్టన్ స్టేట్ ఎంప్లాయ్‌మెంట్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్‌కు మైక్రోసాఫ్ట్ సమర్పించిన ఫైలింగ్ ప్రకారం... వాషింగ్టన్ రాష్ట్రంలోని రెడ్‌మండ్ కార్యాలయంలో అదనంగా 305 మంది ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. గత నెలలో ప్రకటించిన 6,000 ఉద్యోగాల కోతకు ఇది అదనమని కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. "మారుతున్న మార్కెట్‌లో కంపెనీ విజయం సాధించడానికి అవసరమైన సంస్థాగత మార్పులను కొనసాగిస్తున్నాము" అని ఆయన పేర్కొన్నారు.

ఈ తొలగింపులపై మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల స్పందిస్తూ, ఇవి ఉద్యోగుల పనితీరుకు సంబంధించినవి కావని, సంస్థాగత పునర్వ్యవస్థీకరణలో భాగమేనని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై కంపెనీ ఎక్కువగా దృష్టి సారిస్తున్న నేపథ్యంలో, మారుతున్న ప్రాధాన్యతలకు అనుగుణంగా బృందాలను పునరేకీకరించడం అవసరమని ఆయన టౌన్‌హాల్ సమావేశంలో ఉద్యోగులకు వివరించారు. ఈ నిర్ణయం వల్ల కలిగే భావోద్వేగ ప్రభావాన్ని గుర్తించినప్పటికీ, ఇవి వ్యూహాత్మక మార్పుల వల్లే తప్ప, ఉత్పాదకత లేదా ప్రతిభలో లోపాల వల్ల కాదని నొక్కి చెప్పారు.

గత నెలలో జరిగిన 'మైక్రోసాఫ్ట్ బిల్డ్ 2025' కార్యక్రమంలో కంపెనీ చీఫ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ ఫ్రాంక్ ఎక్స్ షా మాట్లాడుతూ, "మనం ఏఐ ఏజెంట్ల యుగంలోకి ప్రవేశించాం" అని అన్నారు. రీజనింగ్ మరియు మెమొరీలో అద్భుతమైన పురోగతి కారణంగా ఏఐ నమూనాలు ఇప్పుడు మరింత సమర్థవంతంగా మారాయని, గిట్‌హబ్ కోపైలట్‌ను ఇప్పటికే 15 మిలియన్ల డెవలపర్లు ఉపయోగిస్తున్నారని ఆయన తెలిపారు. అలాగే, లక్షలాది మంది కస్టమర్లు మైక్రోసాఫ్ట్ 365 కోపైలట్‌ను వాడుతున్నారని, 2,30,000కు పైగా సంస్థలు కోపైలట్ స్టూడియోతో ఏఐ ఏజెంట్లను రూపొందించుకున్నాయని ఆయన వివరించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే కంపెనీ తన కార్యకలాపాలను పునర్‌వ్యవస్థీకరిస్తున్నట్లు తెలుస్తోంది.



### నడిరోడ్డుపై దళిత, ముస్లిం యువకులను కొట్టే హక్కు

# పోలీసులకు ఎవరిచ్చారు..?

పోలీసులకు ఉందా? ఇది ధర్మమేనా? పరువు, ప్రతిష్టలు తీసే హక్కు పోసులకు ఉందా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తెనాలిలో పర్యటించిన ఆయన.. పోలీసుల చేతిలో హింసకు గురైన యువకుల కుటుంబాలను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. నడిరోడ్డులో యువకులపై పోలీసుల థర్డ్ డిగ్రీ దాష్టికాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అదుపు తప్పిపోతే పోలీసు వ్యవస్థ ఎంతగా దిగజారిపోతుందని చెప్పడానికి నిదర్శనం ఈ రోజు తెనాలిలో కనిపిస్తోంది. ఎలాంటి దారుణమైన పరిస్థితులు ఉన్నాయంటే..ఈ రోజు రాష్ట్రంలో జరుగుతున్న అనేక సంఘటనలు గమనిస్తే..ప్రతి సంఘటనలో ఏ రకంగా చంద్రబాబు, ఆయన పార్టీ రెడ్‌బుక్ రాజ్యాంగం తీసుకువచ్చి పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు. తనకు వ్యతిరేకంగా గొంతు వినిపిస్తే ఆ గొంతు అనగదొక్కే కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు దగ్గరుండి వైయస్‌ఆర్‌సీపీకి సంబంధించిన మాజీ మంత్రులు, నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలపై ఏరకంగా తప్పుడు కేసులు పెడుతున్నాడు. ఏరకంగా వాళ్లను జైళ్లలో పెడుతున్నాడు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం ఒక పరిపాటిగా మారిపోయిందనడానికి రాష్ట్రంలో ఈ రోజు జరుగుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగం మన కళ్లెదుటే కనిపిస్తున్న సత్యం. ఆ రకంగా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నీవు ఉపయోగించుకోవడంతో పోలీసు వ్యవస్థ అదుపుతప్పితే ఎలాంటి వికృతరూపం దాల్చుతుందని చెప్పడానికి నిదర్శనం ఈ రోజు తెనాలిలో జరిగిన ఘటనే సాక్ష్యం. రాష్ట్రంలో ఇంతటి భయానక పరిస్థితుల మధ్య..తెనాలిలో ఏం జరిగింది. ఎందుకింత అన్యాయమైన ఘటన జరిగిందో తెలుసుకునేందుకు అందరం కలిసికట్టుగా వెళ్దాం. వీళ్లను నడిరోడ్డుపైకి తీసుకువచ్చి విక్టర్ జేబులో ఒక కత్తి పెట్టి ఇద్దరు వీఆర్‌వోలను పిలిచి మరణాయుధం విక్టర్ జేబులో ఉన్నట్లు పంచనామా రాయించారు. మరుసటి రోజు ఏప్రిల్ 28వ తేదీ వీళ్లను కోర్టులో హాజరు పరిచారు. ఏప్రిల్ 26న నడిరోడ్డుపై ఈ ముగ్గుర్నీ ఇలా కొడుతుంటే నెల రోజుల తర్వాత ఈ వీడియో బయటకొచ్చింది. వీడియో రికార్డు చేసింది కూడా పోలీసులే. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను జీర్ణించుకోలేక మంచి వారైన పోలీసులు ఈ వీడియోను విడుదల చేయడం జరిగింది. ఒకవైపు న చట్టాలను ఉల్లంఘించి అపహాస్యం చేసింది పోలీసులే. మరోవైపున పోలీసులే వీరిని అభాసుపాలు చేస్తూ వీరి కుటుంబ గౌరవాలను మంట కలుపుతూ చెయ్యకూడని పనులన్నీ చేసి వీరి మీద రౌడీ ముద్ర వేస్తున్నారు. లా అండ్‌ఆర్డర్ పూర్తిగా గాలికి ఎగిరిపోయిన పరిస్థితి. వీటి అన్నింటి మధ్య మా ప్రభుత్వం గతంలో అమలు చేసిన పథకాలన్నీ రద్దు చేశారు. మరోవైపు వీళ్లు చేస్తామని మాటిచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్‌లు గాలికొదిలేశారు. మేనిఫెస్టోలో చెప్పిన 143 హామీలను వీళ్లు పట్టించుకున్న పాపాన పోలేదు. అందుకనే ఇలాంటి పాలనకు వ్యతిరేకంగా రేపు రాష్ట్రవ్యాప్తంగా వెన్నుపోటు దినంగా ప్రకటించి ప్రతి నియోజకవర్గంలో ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రప్రజలందరూ కూడా గళం విప్పమని మరొక్కసారి పిలుపునిస్తున్నా.. ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నాను..ఇలాంటి ప్రభుత్వం కొనసాగడానికి ఏ ఒక్కరికీ మంచిది కాదు. ఎంత త్వరగా ఈ ప్రభుత్వాన్ని సాగనంపితే ప్రజలు అంత సస్యశ్యామలంగా బతికే పరిస్థితి ఉంటుంది. ప్రతి ఒక్కరూ కూడా కలిసి రావాలని కోరుకుంటూ వైయస్ జగన్ మోహన్ రెడ్డి సెలవు తీసుకున్నారు.

# తెనాలిలో జగన్‌కు నిరసన సెగ

పరామర్శించడానికి వస్తున్నారంటూ అభ్యంతరం వ్యక్తం చేశాయి. జగన్ కాన్వాయ్ వస్తున్న సమయంలో నల్లబెలూన్లతో దళిత సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. జగన్‌కు వ్యతిరేకంగా ఆయా సంఘాల నేతలు నినాదాలు చేశారు. తెనాలిలో సామాన్యులపై దాడులు, మహిళలపై వేధింపులు, గంజాయి విక్రయాలకు పాల్పడిన ముఠా సభ్యులను పరామర్శించేందుకు జగన్ వస్తున్నారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా, తెనాలిలో దళిత, మైనారిటీ వర్గాలకు చెందిన యువకులపై కొందరు పోలీసులు ఇటీవల దాడి చేశారన్న ఆరోపణలపై తీవ్ర దుమారం రేగుతున్న నేపథ్యంలో జగన్ ఇవాళ తెనాలిలో పర్యటించడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. గత ఏప్రిల్ 25న తెనాలిలో జాన్ విక్టర్, కరీముల్లా, రాకేష్ అనే ముగ్గురు యువకులపై కొందరు పోలీసులు అత్యంత దారుణంగా దాడి చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ యువకులు దళిత, మైనారిటీ వర్గాలకు చెందినవారని తెలుస్తోంది. గంజాయి కలిగి ఉన్నారనే అనుమానంతో ఓ పోలీసు కానిస్టేబుల్‌తో ఈ యువకులకు వాగ్వాదం జరిగిందని, ఆ తర్వాత రద్దీగా ఉండే రోడ్డుపై అందరూ చూస్తుండగా పోలీసులు వారిని కింద కూర్చోబెట్టి లాఠీలతో కొట్టారని సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన వీడియో మే 26న సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

# ఆల్ టైమ్ రికార్డ్... హైదరాబాద్‌లో రూ.1 లక్ష దాటిన బంగారం ధర

రూ.1,00,015 వద్ద గరిష్ఠ స్థాయిని తాకింది. ఇప్పుడు ఆ రికార్డును కూడా అధిగమించి పసిడి ధర కొత్త శిఖరాలకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు పెరగడం, డాలర్‌తో రూపాయి మారకం విలువలో చోటుచేసుకుంటున్న హెచ్చుతగ్గులు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, సరఫరా-డిమాండ్ మధ్య ఉన్న వ్యత్యాసం, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ అనిశ్చిత పరిస్థితులు వంటి అంశాలు బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కారణంగా బంగారం కొనుగోళ్లు పెరిగాయి. అంతేకాకుండా, చాలామంది బంగారాన్ని దీర్ఘకాలిక సురక్షితమైన పెట్టుబడిగా భావించడం కూడా అధిక కొనుగోళ్లకు కారణమైంది.

### తుని రైలు దహనం కేసు..

# రీ ఓపెన్‌కు ప్రభుత్వం రెడ్ ఫ్లాగ్..

చేర్చాలంటూ 2016 జనవరి 31న బహిరంగ సభ నిర్వహించారు. ఆ సమయంలో అటుగా వస్తున్న రైలును దహనం చేశారు. ఆ కేసుకు సంబంధించి సుదీర్ఘంగా విచారణ జరిగింది. ఈ కేసుకు సంబంధించి రైల్వే పోలీసులు సరైన ఆధారాలు సమర్పించలేదని పేర్కొంటూ 2023 మే 1న రైల్వే కోర్టు ఈ కేసు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో ముద్రగడ సహా పలువురిపై నమోదైన కేసులు కొట్టివేస్తూ గతంలో విజయవాడ రైల్వే కోర్టు తీర్పు ఇచ్చింది.

# ప్రపంచంలోని 7 అద్భుతమైన వాటర్ ఫాల్స్ ఇవే!

**ప్రకృతి అద్భుతాలు: ప్రపంచంలోనే గొప్ప జలపాతాలివి!**
**ఈ జలపాతాలను చూస్తే వావ్ అనాల్సిందే!**
**కళ్లు చెదిరే సౌందర్యం... వీటి సొంతం!**

జలపాతాలు వాటి ప్రచండ శక్తి, సహజ సౌందర్యంతో చూపరులను ఇట్టే ఆకట్టుకుంటాయి. ఎత్తైన కొండల పైనుంచి ఉధృతంగా కిందికి దూకే నీటి హోరు, మైమరపించే ఎత్తు, పరిసరాల్లో వ్యాపించే చల్లని నీటి తుంపరలు.. ఇవన్నీ కలిసి ఒక అద్భుతమైన అనుభూతిని అందిస్తాయి. దక్షిణ అమెరికాలోని గంభీరమైన జలధారల నుంచి ఐస్‌లాండ్‌లోని మంచు తెరల వెనుక దాగి ఉన్న జలపాతాల వరకు, ఈ ప్రకృతి అద్భుతాలు ఎంత నాటకీయంగా ఉంటాయో, అంతే మరపురానివిగా నిలుస్తాయి. వాటి పాదాల వద్ద నిలబడి భూమి కంపించడాన్ని అనుభవించినా, కొండ అంచు నుంచి వాటిని వీక్షించినా, ప్రపంచంలోని ఈ ఏడు అతిపెద్ద జలపాతాలు ప్రతి ఒక్కరికీ జీవితకాలం గుర్తుండిపోయే జ్ఞాపకాలను, ప్రయాణ కాంక్షను రేకెత్తిస్తాయి. ఈ అద్భుతాలను చూసి ఆశ్చర్యపోవడానికి సిద్ధంగా ఉండండి.

## 1. ఇగ్వాజు జలపాతం౹ అర్జెంటీనా & బ్రెజిల్



ఎత్తు: 82 మీటర్లు (అత్యంత పొడవైన పతనం)
సందర్శనకు ఉత్తమ సమయం: మార్చి నుంచి మే లేదా ఆగస్టు నుంచి అక్టోబర్
అర్జెంటీనా, బ్రెజిల్ దేశాల సరిహద్దుల్లో విస్తరించి ఉన్న ఇగ్వాజు కేవలం ఒక జలపాతం కాదు, అదొక సంపూర్ణ అద్భుత దృశ్యకావ్యం. దాదాపు 3 కిలోమీటర్ల వెడల్పున ఇగ్వాజు నదిపై సుమారు 275 విడివిడి జలపాతాలు సమ్మిళితమై, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది. ఈ జలపాతం సందర్శకులకు జీవితంలో మరిచిపోలేని అనుభూతిని అందిస్తుంది. ఇందులోని అత్యంత ప్రసిద్ధమైన భాగం "డెవిల్స్ థ్రోట్" (గార్గాంటా డెల్ డయాబ్లో). ఇక్కడ టన్నుల కొద్దీ నీరు ఒక ఇరుకైన లోయలోకి ప్రచండమైన శబ్దంతో దూకుతుంది. బ్రెజిల్ వైపు నుంచి ఈ జలపాతాన్ని చూస్తే విశాలమైన, సుందరమైన దృశ్యం కనువిందు చేస్తుంది. అర్జెంటీనా వైపున అయితే, జలపాతపు నీటి తుంపరలను దాదాపు తాకుతూ, దగ్గరగా వెళ్లి చూసేందుకు వీలుగా థ్రిల్లింగ్ అనుభూతినిచ్చే చెక్క వంతెనలు నిర్మించారు.

## 2. విక్టోరియా జలపాతం జాంబియా & జింబాబ్వే



ఎత్తు: 108 మీటర్లు
సందర్శనకు ఉత్తమ సమయం: ఫిబ్రవరి నుంచి మే (నీటి ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు)
స్థానికంగా "మోసి-ఒఅ-తున్య" (గర్జించే పొగ) అని పిలవబడే విక్టోరియా జలపాతం, ప్రపంచంలోని అతిపెద్ద పరదా జలపాతాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. జాంబేజీ నది నీరు బసాల్ట్ కొండ చరియల పైనుంచి కిందికి పడుతూ, వందల మీటర్ల ఎత్తుకు నీటి ఆవిరి మేఘాలను సృష్టిస్తుంది. ఈ నీటి ఆవిరి సుమారు 50 కిలోమీటర్ల దూరం నుంచి కూడా కనిపిస్తుంది. వర్షాకాలంలో ఇక్కడికి వెళితే, జలపాతం ఉధృతిని సంపూర్ణంగా ఆస్వాదించవచ్చు, కానీ పూర్తిగా తడిసిపోవడానికి సిద్ధంగా ఉండాలి. గుండెలు ఉత్కంఠతో కొట్టుకునేలా చేసే దృశ్యాల కోసం (మరియు సెల్ఫీల కోసం) "నైఫ్-ఎడ్జ్ బ్రిడ్జ్" తప్పక చూడాల్సిన ప్రదేశం.



## .3. నయాగరా జలపాతం - కెనడా & అమెరికా

ఎత్తు: 51 మీటర్లు
సందర్శనకు ఉత్తమ సమయం: జూన్ నుంచి ఆగస్టు
నయాగరా జలపాతం ఎత్తులో మరీ గొప్పది కాకపోయినా, తన శక్తి, ప్రత్యేకతలతో ఎంతగానో ఆకట్టుకుంటుంది. ప్రతి సెకనుకు 2.8 మిలియన్ లీటర్లకు పైగా నీరు, మూడు ప్రధాన పతనాలలో అతిపెద్దదైన హార్స్‌షు ఫాల్స్ మీదుగా ప్రవహిస్తుంది. ప్రఖ్యాత "మేడ్ ఆఫ్ ది మిస్ట్" బోటులో ప్రయాణించడం ఇక్కడ తప్పనిసరి అనుభవం %-% వారు అందించే ప్లాస్టిక్ కోట్లు నీటి నుంచి కాపాడటం కంటే, ఒక సంకేతంగానే ఎక్కువ ఉపయోగపడతాయి. రాత్రిపూట సందర్శిస్తే, జలపాతాలు ఇంద్రధనస్సు రంగుల దీపాలతో వెలిగిపోతుండగా, వేసవిలో బాణాసంచా వెలుగులు ఆకాశాన్ని మరింత శోభాయమానంగా మారుస్తాయి.

## 4. ప్లిట్విస్ జలపాతాలు - క్రొయేషియా



ఎత్తు: 78 మీటర్లు (పార్క్ లోని అతి పొడవైన వెలికి స్లాప్)
సందర్శనకు ఉత్తమ సమయం: మే నుంచి జూన్ లేదా సెప్టెంబర్ నుంచి అక్టోబర్
ప్లిట్విస్ సరస్సుల జాతీయ పార్క్, 90కి పైగా జలపాతాల ద్వారా అనుసంధానించబడిన 16 సోపాన సరస్సుల అద్భుత ప్రపంచం. ఖనిజాలు, సూర్యరశ్మిని బట్టి ఇక్కడి స్ఫటిక స్వచ్ఛమైన నీరు మణి నీలం నుంచి పచ్చ రంగులోకి మారుతూ, ప్రకృతి చిత్రించిన అద్భుత వర్ణచిత్రంలా కనిపిస్తుంది. పచ్చని అడవి గుండా చెక్క నడక మార్గాలు నిర్మించబడ్డాయి. పక్షుల కిలకిలరావాలు తప్ప, జలపాతాల నీటి శబ్దంతో నిండిన ప్రశాంత వాతావరణం ఇక్కడ ఉంటుంది. ఇది ఉధృతి కంటే ఎక్కువగా, అబ్బురపరిచే ప్రశాంతతకు నిలయం.

## 5. ఏంజెల్ జలపాతం - వెనిజులా



ఎత్తు: 979 మీటర్లు
సందర్శనకు ఉత్తమ సమయం: జూన్ నుంచి నవంబర్
ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన, అంతరాయం లేని జలపాతంగా పేరుగాంచిన ఏంజెల్ జలపాతం ఎంత ఎత్తులో ఉందంటే, నీరు తరచుగా కింది అడవిని తాకేలోపే ఆవిరిగా మారిపోతుంది. కనైమా నేషనల్ పార్క్ లోపల చాలా దూరంగా ఉన్న ఈ జలపాతాన్ని చేరుకోవడానికి విమాన ప్రయాణం, ఆపై నదిలో పడవ ప్రయాణం అవసరం. అయితే, ఈ మారుమూల ప్రదేశమే దీని రహస్య సౌందర్యాన్ని మరింత పెంచుతుంది. 1937లో పైలట్ జిమ్మీ ఏంజెల్ తన విమానంతో దీని సమీపంలో కూలిపోయినందున (ఆ విమానం ఇప్పటికీ అక్కడే ఉంది), ఈ జలపాతానికి ఆ పేరు వచ్చింది. ఇది సహజ సౌందర్యానికి అసలైన నిర్వచనం.

## 6. గల్ఫాస్ జలపాతం - ఐస్‌లాండ్



ఎత్తు: 32 మీటర్లు (రెండు దశల్లో)
సందర్శనకు ఉత్తమ సమయం: జూన్ నుంచి ఆగస్టు
ఐస్‌లాండ్ యొక్క "గోల్డెన్ సర్కిల్" పర్యటన గల్ఫాస్, అంటే "బంగారు జలపాతం" సందర్శన లేకుండా అసంపూర్ణంగా ఉంటుంది. హిమానీనదాల నీటితో పోషించబడే హ్విటా నది, రెండు అంచెలుగా ఒక కఠినమైన లోయలోకి దూకుతుంది. తరచుగా సూర్యరశ్మిలో ఇంద్రధనుస్సులను సృష్టించే మెరిసే నీటి ఆవిరి మేఘాలను ఇది పైకి పంపుతుంది. ఇతర అనేక జలపాతాలలా కాకుండా, ప్రత్యేకంగా నిర్మించిన వీక్షణ మార్గాల వల్ల మీరు గల్ఫాస్ పక్కనే నిలబడవచ్చు. అయితే, శీతాకాలంలో గడ్డకట్టిన నీటి తుంపరల వల్ల జారే ప్రమాదం ఉంటుంది కాబట్టి జాగ్రత్త వహించాలి.

## 7. తుగెల జలపాతం - దక్షిణాఫ్రికా

ఎత్తు: 948 మీటర్లు
సందర్శనకు ఉత్తమ సమయం: వేసవి నెలలు (నవంబర్ నుంచి మార్చి)
ఒకప్పుడు ప్రపంచంలో రెండవ ఎత్తైన జలపాతంగా భావించబడిన (భూగర్భ శాస్త్రవేత్తల మధ్య ఇప్పటికీ చర్చనీయాంశం) దక్షిణాఫ్రికాలోని డ్రాకెన్స్‌బర్గ్ పర్వతాలలో ఉన్న తుగెల జలపాతం, ఐదు అంచెల జలధార. దీనిని చేరుకోవడానికి కొంత శ్రమ అవసరం, కానీ లభించే ప్రతిఫలం అమోఘం. పైకి చేసే ట్రెక్ యాంఫిథియేటర్ శిఖరం యొక్క తలతిరిగేంత దృశ్యాలను అందిస్తుంది. భారీ వర్షాల తర్వాత, జలపాతం పూర్తి స్థాయిలో ప్రవహిస్తుంది. నిటారుగా ఉండే ట్రెక్కింగ్‌పై ఆసక్తి లేనివారికి, దిగువన ఉన్న ఒక మోస్తరు వీక్షణ స్థానం కూడా అద్భుతమైన ఫోటో అవకాశాలను అందిస్తుంది.



# పాక్‌లో భూకంపం..

## తప్పించుకున్న 200 పైగా ఖైదీలు



పాకిస్థాన్‌లోని బఛా జైలు పరిసర ప్రాంతంలో భూకంపం రావడంతో 200లకు పైగా ఖైదీలు (%ాతీఅంశీఅవతీం జుంమ్ఝజూవ‌స%) తప్పించుకున్నారు. సోమవారం ఇక్కడ మూడుసార్లు భూమి కంపించింది. దీంతో జైలులోని కొన్ని గోడలకు పగుళ్లు రాగా.. కొన్ని కూలిపోయాయి. ఈ క్రమంలో 600 నుంచి వెయ్యి మంది ఖైదీలను బ్యారక్‌ల నుంచి వేరే ప్రాంతానికి అధికారులు తరలిస్తుండగా.. ఖైదీలు తప్పించుకున్నారు(%ాతీఅంశీఅవతీం జుంమ్ఝజూవ‌స%). పలువురు అధికారుల వద్ద ఉన్న తుపాకులు తీసుకొని కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఒక ఖైదీ మృతి చెందగా.. నలుగురు అధికారులు గాయపడ్డారు. ఖైదీల పరారీతో అప్రమత్తమైన అధికారులు తిరిగి ఖైదీలను పట్టుకొనేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకూ 80 మందిని పట్టుకున్నామని.. అందుకు స్థానికుల సహాయం తీసుకున్నట్లు ఓ అధికారి తెలిపారు. ఈ జైలులో ఎక్కువ శాతం మాదకద్రవ్యాల సంబంధిత కేసుల్లోని నేరస్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారని మరో అధికారి తెలిపారు. పారిపోయిన వారిలో డ్రగ్స్ నేరస్థులు, మానసికంగా సరిగా లేని వారే అని ఎక్కువ ఉన్నారన్నారు.

# మాంసం వినియోగంలో తెలంగాణ టాప్!

**మాంసాహారులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణకు ఏడో ర్యాంకు**
**నెలకు సగటున ఒక వ్యక్తి 2 కిలోల మాంసం వినియోగం**
**నాగాలాండ్‌లో 99.8 శాతం మంది మాంసాహారులే**
**ఏపీ, తెలంగాణ, తమిళనాడులో చికెన్, మటన్‌తో పాటు చేపల వినియోగమూ ఎక్కువ**



హైదరాబాద్ జూన్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

దేశంలో మాంసాహార వినియోగంలో తెలంగాణ రాష్ట్రం పరిమాణం పరంగా మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో సగటున ఒక్కో వ్యక్తి నెలకు రెండు కిలోల మాంసం తింటున్నట్లు నేషనల్ మీట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎంఎంఆర్ఐ) నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. అయితే, మాంసం తినే వారి సంఖ్య పరంగా చూస్తే తెలంగాణ ఏడో స్థానంలో ఉందని జాతీయ ఆరోగ్య, కుటుంబ సర్వే నివేదిక పేర్కొంది. దేశంలో అత్యధికంగా నాగాలాండ్ ప్రజలు మాంసాహారాన్ని ఇష్టపడుతున్నట్లు ఈ సర్వే తెలిపింది. ఆ రాష్ట్ర జనాభాలో ఏకంగా 99.8 శాతం మంది మాంసాహారం తింటున్నారని వివరించింది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రజల మాంసాహారపు అలవాట్లు కూడా విభిన్నంగా ఉన్నాయని సర్వే వెల్లడించింది. ఉదాహరణకు.. నాగాలాండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ప్రజలు ఎక్కువగా చేపలను ఇష్టపడతారు. ఇక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో చికెన్, మటన్‌తో పాటు చేపలను కూడా అధికంగా తింటారు. ఒడిశా ప్రజలు రొయ్యలను ఇష్టంగా భుజిస్తారు. మరోవైపు, త్రిపురలో పంది మాంసం వినియోగం ఎక్కువగా ఉండగా, గోవాలో చేపలు, పీతల వంటి సముద్ర ఆహారం (సీఫుడ్) ఎక్కువగా తింటున్నారని సర్వే స్పష్టం చేసింది.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

బుధవారం 04 జూన్ 2025

# రెండు రోడ్ల పనులను పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల





**అమలాపురం, జూన్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమలాపురం పట్టణం చిన్న వంతెన వద్ద నుండి బైపాస్ రోడ్డును కలిపేందుకు నిర్మిస్తున్న రెండు రోడ్ల పనులను పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు ఈ కార్యక్రమంలో ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు గారు, అధికారి బాబ్జి గారు, దున్నాల దుర్గా గారు, సుధా చిన్న గారు, సుమన్ వర్మ గారు మరియు తదితరులు పాల్గొన్నారు





## ఎమ్మెల్యే త్రిముఖ వ్యూహంతో

# ట్రాఫిక్ సమస్యకు చెక్...

### మూడు రోడ్డులను పరిశీలించిన అనందరావు....



**అమలాపురం, జూన్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమలాపురం పట్టణం నుంచి బైపాస్ కు కలిసే మూడు రహదారులను అభివృద్ధికి ఎమ్మెల్యే అనందరావు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రెండు రహదారుల నిర్మాణం దాదాపు పూర్తి అయ్యింది. మొదటిది కుమ్మరి కాలువ ఎడమ గట్టు సీతా పతి రావు పేట నుంచి ఆనంద మార్గ్ ద్వారా 600 మీటర్ల దూరంలో బై పాస్ రోడ్డుకు చేరుకుంటారు. అదే విధంగా కుమ్మరి కాలువ కుడి గట్టు విశ్వరూప్ మార్గ్ నుంచి స్మశానం మీదుగా కబేలా గుండా సావరం సెంటర్ కు 1.5 కిలో మీటర్లలో బై పాస్ చేరుకుంటుంది. ఈ రోడ్డు కుడా దాదాపు 80 శాతం పూర్తి అయ్యింది. ఎమ్మెల్యే అనందరావు మంగళవారం ఈ రోడ్లు ను పరిశీలించి కబేల నుంచి సావరం వరకు కొత్తగా వేస్తున్న 20 అడుగు ల రోడ్డును 30 అడుగులు చేయాలని అధికారులు కు ఆదేశాలు జారిచేసారు. విశ్వరూప్ మార్గ్ నుంచి స్మశానం మీదుగా వున్న కుడి గట్టును కుడా అభివృద్ధి చేయాలని అధికారులు కు చెప్పారు. ఈ రోడ్డు డైరెక్ట్ గా బై పాస్ కు కేవలం 500 మీటర్ల లో చేరుకుంటారు. ఈ మూడు రోడ్లు పూర్తి అయితే ట్రాఫిక్ సమస్య కు వెసుల బాటు ఉంటుందని ఎమ్మెల్యే ఆనంద రావు అన్నారు. ఆయన వెంట ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు , అధికారి బాబ్జి , దున్నాల దుర్గా, సుధా చిన్న , సుమన్ వర్మ, కాంట్రక్టర్ లాల్, అంబికా రాంబాబు, రవణం నరసింహరావు, ఏడిద దొరబాబు, ఆకుల నాగేశ్వర రావు, గొర్తి పవన్ తదితరులు పాల్గొన్నారు.ం



స్థానిక ఆర్డిఓ ఆఫీస్ లో ఎస్.యానం గ్రామస్తులు మరియు ఓఎన్జిసి వేదాంత అధికారులతో జరిగిన సమావేశంలో పాల్గొన్న గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు, ఆర్టీవో గారు, వేదాంత కంపెనీ అధికారులు



# అంతర్వేది సాగర తీరంలో యోగా పరవశం

**- 3 వేల మందితో యోగాసనాలు**
**- యోగా సాధనలో ఉత్సాహంగా యువత, మహిళలు**
**- పాల్గొన్న జాయింట్ కలెక్టర్ నిషాంతి, ఎమ్మెల్యే వరప్రసాద్**

**సఖినేటిపల్లి, జూన్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

సముద్ర తరంగాల సాక్షిగా.. సూర్యోదయ కిరణాల మధ్య.. శరీరం, మనస్సు, శ్వాసల సమన్వయంతో ఒక్కటైన పవిత్ర క్షణాలతో ప్రకృతితో పరమాత్మను అనుసంధానించే యోగా సాధనకు అంతర్వేది తీరం నీలి కాంతులతో పరవశమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది బీచ్‌లో మంగళవారం 3,000 మందితో యోగా కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిషాంతి, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, డీఆర్ఓ బి.రాజకుమారి, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, డీఈఓ షేక్ సలీం భాష, పీడీ డ్వామా మధుసూదన్, జి.ఎస్.డబ్ల్యూఎస్ నోడల్ ఆఫీసర్ రాజేశ్వరరావు, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్.కె. నవాబ్ జాన్ తదితర జిల్లా అధికారులు, మాజీ సైనికులు, యువకులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సూర్య భగవానుడు నుంచి ప్రసరిస్తున్న సూర్యకిరణాల ఆకృతిలో నిలబడి యోగాసనాలు నిర్వహించిన తీరు ప్రత్యేకంగా ఆకట్టుకుంది. సముద్రపు చల్లని గాలులతో కూడిన తీరప్రాంతంలో, ఉదయం సూర్యోదయ కిరణాల మధ్య నిర్వహించిన యోగాసనాలు పాల్గొన్న వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఉదయం 7:30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం సుమారు గంటన్నర పాటు సాగింది. ప్రఖ్యాత యోగా గురువు డాక్టర్ పి.రామచంద్ర ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం, ఇతర యోగా ఆసనాలను అభ్యసించారు. పిల్లలు, మహిళలు, వృద్ధులకు అనుకూలమైన యోగా ఆసనాలు ప్రత్యేకంగా నిర్వహించడంతో అన్ని వయసుల వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. వృక్షాసనంలో సుమారు 200 మంది సమన్వయంగా నిలబడి చేసిన విన్యాసం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

**యోగా ప్రతి ఒక్కరికీ అవసరమైన జీవనశైలి :**

ఈ సందర్భంగా యోగా గురువు పి. రామచంద్ర మాట్లాడుతూ యోగ ద్వారా శరీరానికి ధృఢత్వం, మానసిక స్థిరత, అంతర్గత శాంతి లభిస్తాయన్నారు. యువతలో పెరుగుతున్న ఒత్తిడిని



తగ్గించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఇది ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగమవ్వాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ టి. నిషాంతి మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగాపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ముఖ్యమైన పర్యాటక ప్రదేశాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ నేపథ్యంలో 3,000 మందితో అంతర్వేది సముద్రతీరంలో యోగా కార్యక్రమం నిర్వహించామన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయివరకు యోగా ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. మే 26 నుంచి జూన్ 2 వరకు గ్రామస్థాయిలో యోగా పోటీలు నిర్వహించామన్నారు. అలాగే యోగా ప్రాముఖ్యతను చాటేలా రంగోలి పోటీలు నిర్వహించి బహుమతులు కూడా అందించామన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో యోగా పట్ల ఆసక్తి పెరిగిందన్నారు. ప్రతి రోజు కేవలం పది నిమిషాలైనా యోగా చేయడం వల్ల జీవితంలో గొప్ప మార్పులు వస్తాయన్నారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర పేరిట రాష్ట్ర వ్యాప్తంగా యోగా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు శ్రద్ధ వహిస్తున్నాయన్నారు. ఇళ్లలో, కార్యాలయాల్లో శారీరక శ్రమ లేకుండా జీవనం సాగిస్తున్నవారు మధుమేహానికి గురవుతున్నారని ఆరోగ్యం పట్ల అవగాహనతో ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా మధుమేహాన్ని నివారించవచ్చని చెప్పారు. వ్యాయామం చేయకపోతే అనేక వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రాజోలు నియోజకవర్గంలో యోగా కార్యక్రమాలు అద్భుతంగా నిర్వహిస్తున్నారని, చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చి అంతర్వేది బీచ్‌లో యోగా చేయడం సంతోషకరమైన విషయం అన్నారు. జూన్ 21న విశాఖపట్నంలో నిర్వహించనున్న ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమానికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంచేందుకు యోగాంధ్ర పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ నిత్య జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని ఆకాంక్షించారు.



# నూతన విద్యా విధానాలపై దృష్టి సారించండి

### - ఉపాధ్యాయులకు డీఈవో సలీం భాషా సూచన

**అమలాపురం, జూన్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ప్రస్తుత నూతన విద్యా సంవత్సరంలో అమలు కాబోతున్న ప్రధాన మార్పులపై దృష్టి సారించాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం భాషా ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం అమలాపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సెకండరీ స్థాయి ఉపాధ్యాయులకు, జిల్లా రిసోర్స్ పర్సన్లకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ జి.మమ్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో సలీం భాషా మాట్లాడుతూ జిల్లా విద్యా శాఖ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో సెకండరీ స్థాయి ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు నియమితులైన జిల్లా రిసోర్స్ పర్సన్లకు మూడు రోజుల పాటు నూతన విద్యా సంవత్సరంలో అమలు కాబోతున్న ప్రధాన మార్పులపై అవగాహన కల్పిస్తారన్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆన్సర్ బుక్స్, పరీక్షా విధానంలో చోటుచేసుకున్న మార్పులు, తరగతి గది బోధనలో వినియోగించాల్సిన టీచ్ టూల్స్, అబ్జర్వేషన్ పద్ధతులు, నూతన అకడమిక్ క్యాలెండర్ తదితర అంశాలపై శిక్షణ విశ్లేషణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. డీఈవో కోర్సు సంచాలకులుగా వ్యవహరిస్తారన్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ఇన్‌చార్జ్‌గా బి.హనుమంతరావు, కోర్స్ కో ఆర్డినేటర్‌గా జిల్లా సైన్స్ అధికారి జి.వి.ఎస్.సుబ్రహ్మణ్యం, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి గుబ్బల సూర్య ప్రకాశం పర్యవేక్షిస్తారన్నారు. సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ మమ్మీ మాట్లాడుతూ మధ్యాహ్న సమయంలో తరగతి గదుల్లో శిక్షణా ప్రాసెస్‌ను ప్రత్యక్షంగా పర్యవేక్షించిన సలీం భాషా నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన మార్పులపై ప్రత్యేక తరగతిని నిర్వహించారన్నారు. ఈ శిక్షణలో ఉపాధ్యాయులు నూతన విద్యా విధానాలపై స్పష్టత పొందడంతో పాటు విద్యార్థులకు మరింత సమర్థవంతమైన బోధన అందించగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ పవన్ రామ్, డైట్ లెక్చరర్ కే. కృష్ణసాయి, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బి.వి.వి.సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్ రమేష్, భీమారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, స్టేట్ రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

# అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్రకు ఆర్టీసీ బస్సు సర్వీసులు

**అమలాపురం, జూన్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అమలాపురం డిపో నుండి అరుణాచలం గిరి ప్రదక్షణకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రలో భాగంగా కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి, శ్రీకాళహస్తి, విజయవాడ ప్రాంతాలలోని దేవాలయాల దర్శనానికి ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూన్ 9వ తేదీ సోమవారం అమలాపురం డిపో నుండి బస్సు బయలుదేరి పైన తెలియజేసిన క్షేత్రములు దర్శించుటతో పాటు అరుణాచల గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత 12వ తేదీ గురువారం తిరిగి అమలాపురం రావటం జరుగుతుందన్నారు. పుష్ బ్యాక్ 2 ం 2 సిట్టింగ్ కలిగిన సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ యాత్రకు బస్సు సర్వీసు పెద్దలకు సూపర్ లగ్జరీ బస్సుకు 2950 రూపాయలు టికెట్ ధర నిర్ణయించడం జరిగిందని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కొరకు 9959225576, 9959225550 నంబర్లలో సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు. ఈ సర్వీస్ కు ఆన్లైన్ లో ముందుగా రిజర్వేషన్ సదుపాయం కలదని, సర్వీస్ నెంబర్ 99500 ఆన్లైన్ లో అందుబాటులో ఉందని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# బాధ్యత కుటుంబానికి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

**అమలాపురం, జూన్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మురమళ్ళ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మృతుల కుటుంబానికి చెక్కులను ప్రభుత్వ విప్ ,ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు పంపిణీ చేశారు. ఇటీవల కమిని లంక గ్రామం లో గోదావరి ప్రమాదములో మృతి చెందిన జీ మూలపాలెం ఎర్రగరువు కు చెందిన వడ్డీ రాజేష్, వడ్డీ మహేష్ ల కుటుంబానికి ఒక్కొకరికి రెండు లక్షల రూపాయలు చెక్కులు ఎమ్మెల్యే అందజేశారు.ఎన్డీఏ ప్రభుత్వం బాధితకుటుంబ నికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే సుబ్బరాజు అన్నారు.

## కూటమి ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట



**జగ్గయ్యపేట, (తెలుగురాష్ట్రం విలేకరి):** జగ్గయ్యపేట పట్టణంలో జి.వి.జె. జి.పి.హెచ్.ఎస్. బాయ్స్ హై స్కూల్ గ్రౌండ్ లో మే 1వ తేదీ నుండి కృష్ణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో కోచ్ రాజేంద్ర నిర్వహించిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపు జూన్ 1వ తేదీ నాటికి ముగియడంతో నెల రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు మంగళవారం పార్టిసిపేట్ సర్టిఫికెట్స్ ను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య చేతుల మీదుగా వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ రోజు ప్రాక్టీస్ చేస్తే తప్ప క్రికెట్ లో రాణించడం సాధ్యం కాదు అని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆటల పట్ల మక్కువ పెంచుకొని ఐకమత్యంతో ముందుకు వెళ్లాలని అన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల ప్రతి మనిషికి మానసిక ఉల్లాసంతో పాటు శరీర దారుఢ్యాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు. క్రీడల్లో క్రికెట్, ఫుట్బాల్ లాంటివి ఆడాలంటే చాలా శ్రమతో కూడుకున్న ఆటలని, వీటిలో ప్రతి ఒక్కరూ తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలంటే ప్రతి రోజు ప్రాక్టీస్ చేయాలని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నోముల రఘు, కోచ్ రాజేంద్ర, బి.వి. సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు, వృద్ధులకు నేరుగా ఇంటి వద్దనే రేషన్

**-ఆర్డీఓ ఎంవి రమణ**



**టి.నర్సాపురం, జూన్ 3 (తెలుగురాష్ట్రం విలేఖరి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రేషన్ షాపుల వద్దకే రేషన్ పంపిణీ విధానాన్ని జంగారెడ్డిగూడెం రెవిన్యూ డివిజనల్ అధికారి ఎం వి రమణ మంగళవారం తనిఖీ నిర్వహించారు. మండల కేంద్రంలోని రేషన్ షాప్ నెంబర్ 1 షాప్ ను తనిఖీ చేసి రేషన్ పంపిణీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం మెట్టగూడెంలోని మంచంలో ఉన్న అనగాని చిట్టెమ్మ, కాశ గాని కనకదుర్గకు స్వయంగా వెళ్లి రేషన్ అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రేషన్ షాపుల వద్ద ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు సరుకులు పంపిణీ చేస్తారని అలాగే దివ్యాంగులకు వృద్ధులకు స్వయంగా రేషన్ డీలర్లు ఇంటికి తీసుకువెళ్లి రేషన్ అందిస్తారని తెలిపారు. ఆమె వెంట తాసిల్దార్ టి సాయిబాబా ఆర్డీవో సిసి సీనియర్ అసిస్టెంట్ హరిబాబు వీఆర్వో పణి కుమార్, సిబ్బంది ఉన్నారు.

## రేషన్ సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు



**పోలవరం, జూన్ 3 (తెలుగు రాష్ట్రం విలేకరి):** పోలవరం మండలంలో రేషన్ పంపిణీ ఊపందుకుంది. లబ్దిదారులు తమ రేషన్ సరుకులను మంగళవారం తమ పరిధి రేషన్ షాపులలో కొనుగోలు చేసుకుని వెళుతున్నారు. గతంలో ఇంటింటికీ రేషన్ పేరిట వ్యాన్ వచ్చి వెళ్ళేదని వ్యాన్ వచ్చేవరకూ వేచి ఉండాల్సి వచ్చేదని గ్రామాలో ఏదో ఒక కూడలిలో పెట్టి రేషన్ ఇచ్చేవారని అక్కడికి వెళ్ళి తెచ్చుకోవలసి వచ్చేదని, వ్యాన్ వచ్చిన సందర్భంలో కూలికోసం వెళితే మళ్ళీ ఆ రేషన్ తెచ్చుకోవడానికి వ్యాన్ ఎక్కడ ఉందో వెతుక్కుని వెళ్ళవలసి వచ్చేదని, రేషన్ కూడా 1 నుండి 10వ తేదీలోపు తీసుకోవలసి వచ్చేదని నేడు ఎలాంటి ప్రయాస లేకుండా పనుల సమయాలలోనే కాకుండా తీరికవేళలో కూడా తమ రేషన్ ఉదయం నుండి సాయంత్రం వరకూ ఎప్పుడైనా తెచ్చుకునే అవకాశం ప్రభుత్వం కల్పించడం హర్షనీయమని రేషన్ లబ్దిదారులు తెలిపారు. వృద్ధులకు వికలాంగులకు నేరుగా ఇండ్లకు రేషన్ పంపిణీ చేయడం మంచి శుభపరిణామమని రేషన్ లబ్దిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

## తుని కాపు కేసుల విచారణ జిఓ రద్దుకు కృషి చేసిన లోకేష్ కి ధన్యవాదాలు

**-రాజ్యసభ సభ్యులు సతీష్ బాబు**



**మంగళగిరి, (తెలుగురాష్ట్రం విలేకరి):** తుని ఘటన రీ ఓపెన్ కావడంతో ఉమ్మడి జిల్లాలోని కాపుల మనోభావాలు దెబ్బతిన్నాయని, ఈ అంశాన్ని అధిష్టానం దృష్టిలో పెట్టేందుకు మంగళవారం మధ్యాహ్నం రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఉండవిల్లికి హుటాహుటిన చేరుకున్నారు. దాదాపు కాపులంతా కూటమి ప్రభుత్వానికి అండగా ఉన్నారని ఆయన లోకేష్ ను కలిసి వివరించాలని భావించారు. అప్పటికే లోకేష్ తుని ఘటన రీ ఓపెన్ వద్దు అని అధికారులకు చెప్పడంతో లోకేష్ ను కలసిన సానా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భగా ఎంపీ సతీష్ బాబు మాట్లాడుతూ దూరదృష్టితో, సామాజిక సమతుల్యతను కాపాడే విధంగా, కాపు సామాజిక ఉద్యమానికి సంబంధించి కేసును రీ ఓపెన్ కాకుండా సత్వర నిర్ణయం తీసుకున్న మంత్రి లోకేష్ మరో సారి ధన్యవాదములు తెలిపారు. ఎంపీ సానా సతీష్ బాబుకు పలు కాపు సంఘాలు కృతజ్ఞతలు తెలిపాయి.

## క్షయపై ముక్త భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమం



**కపిలేశ్వరపురం, జూన్ 3 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంగర పరిధిలో గల కపిలేశ్వరపురం గ్రామములో సర్పంచ్ సాకా శ్రీనివాస్ అధ్యక్షతన డాక్టర్ పిఎంఎస్ డి రత్నకుమారి, డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో క్షయ వ్యాధి పై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదటిగా టిబి ఫ్రీ ఇండియా పై ప్రతిజ్ఞ చేయించారు టి.బి. హరేగా దేశ్ జీతేగా అంటూ నినదించారు. డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ టీబీ వ్యాధి లక్షణాలు అనగా అలసట, తలనొప్పి, బరువు తగ్గడం, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం, కళ్ళి పడడం మొదలైన వాటిని మొదట్లోనే గుర్తించి తగు పరీక్షలు అనగా కళ్ళి పరీక్ష, అవసరమైన వారికి ఎక్సరే పరీక్ష చేయించుకుని తద్వారా వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స ఉచితంగా అందించబడుతుందని తద్వారా వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని, ప్రభుత్వ ఆదేశానుసారముగా జూన్ 2 నుండి నుండి 30 వ తేది వరకు ప్రతి గ్రామములో టి.బి. ముక్త భారత్ అభియాన్ పై అవగాహన శిబిరములు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఎంపీహెచ్ఈఓ జే మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు సంయుక్తంగా మాట్లాడుతూ టీబీ వ్యాధి గ్రస్తులు మందులతో పాటుగా పోషకాహారము తీసుకుంటే వ్యాధి త్వరితగతిన నయమవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమములో ఎస్ టి ఎస్ రమణ, ఎం ఎల్ హెచ్ పి లు - మానుషా, దివ్య, స్త్రీ ఆరోగ్య కార్యకర్తలు - ఝాన్సీ, శిరోమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగన్ వెన్నుపోటు వల్లే 11 స్థానాలు వచ్చాయ్.. మాజీ ఎంపీ తోట



**భీమవరం,జూన్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2024 జూన్ 4న ప్రజలు ఇచ్చిన తీర్పును ప్రస్తుత వైసిపి జగన్ వెన్నుపోటు దినంగా ప్రకటించడం విడ్డూరంగా ఉందని రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. మంగళవారం భీమవరంలోని వారి కార్యాలయంలో మాట్లాడారు. గతంలో వైసీపీకి 151 సీట్లు ఇచ్చిన ప్రజలు 11 సీట్లు ఇచ్చారంటే గతం గుర్తు చేసుకోవాలని, ప్రజలు తీర్పు యిచ్చిన రోజున వెన్నుపోటు దినంగా పరగణించడం సిగ్గుచేటు అన్నారు. జగన్ తన తల్లికి చెల్లికి వెన్నుపోటు పొడిచి తన పరిపాలనలో ఏడాదిలో 10 శాతం హామీలు అమలు చేయలేదన్నారు.

## యోగాను రోజువారీ దిన చర్యలో ఒక భాగంగా చేసుకోవాలి

**పెనుగొండలో 2 వేల మందితో యోగా అభ్యాసన .. పాల్గొన్న జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే పితాని, జిల్లా ఎస్పీ నయీం అస్మి**



**భీమవరం,జూన్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** యోగాను రోజువారీ దినచర్యలో భాగంగా చేసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలు రావని, ఒక్కొక్క ఆసనం ఒక్కొక్క టాబ్లెట్స్ లా పని చేస్తుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, అన్నారు. మంగళవారం పెనుగొండ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద 2 వేల మందితో యోగా అభ్యాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రతిరోజు ఒక అరగంట యోగాను చేస్తే మానసిక ఒత్తిడి తగ్గుతుందని, తద్వారా చేసే పనిలో ఆటంకాలు లేకుండా చేసుకోవచ్చునన్నారు. నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా అనేక రుగ్మతలను దూరం చేసుకునేందుకు వీలుంటుందన్నారు. జూన్ 21వ తేదీ వరకు గ్రామ, మండల, జిల్లాస్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సమయం దొరికినప్పుడు ప్రతి ఒక్కరూ యోగ చేయాలన్నారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భాగమైన యోగపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగ దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మందితో యోగ కార్యక్రమాలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర క్యాంపెయిన్ ను నెల రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ నయీం అస్మి, జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో దాసిరాజు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజలు, విద్యార్థులు ఆసనాలు వేశారు.



## గిరిజన ప్రాంతంలో ఉధ్యానవన సంబంధిత పుడ్ ప్రోసెసింగ్ యూనిట్లపై అవగాహన కల్పించే వర్క్ షాప్ నిర్వహించాలి.

**పిఎం ఇజిపి యూనిట్లు స్థాపనపై దృష్టి పెట్టాలి.**
**ఆరు పరిశ్రమలకు రూ. 44.66 లక్షలు ప్రోత్సాహకాలు**
**కలెక్టర్ కె. వెట్రిసెల్వి.**



**ఏలూరు, జూన్ 3 (తెలుగు రాష్ట్రం విలేకరి):** జిల్లాలోని గిరిజన ప్రాంతంలో ఉధ్యానవన సంబంధిత, ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటుపై అవగాహన కలిగించేందుకు ఏజెన్సీ ప్రాంతంలో వర్క్ షాప్ నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఉధ్యానవన సంబంధిత, ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు నెలకొల్పే విధంగా ఉధ్యానశాఖ, ఐటిడిఏ అధికారులు సమన్వయంతో వర్క షాప్ నిర్వహించాలన్నారు. పిఎం విశ్వకర్మపథకం కు సంబంధించి ప్రగతి తీరుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ పథకం కింద బ్యాంకు రుణాలు మంజూరైన రుణాలు తీసుకునేందుకు లబ్దిదారులు ముందుకు రాకపోవడానికి గల కారణాలను గుర్తించాలన్నారు. ఇందుకు సంబంధించి రానున్న 15 రోజుల్లో సమగ్ర నివేదిక అందజేయాలని ఎల్డిఎం ను కలెక్టర్ ఆదేశించారు. పిఎంఇజిపిపై కలెక్టర్ సమీక్షిస్తూ సంబంధిత మంజూరైన యూనిట్లు స్థాపనకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎల్డిఎంను ఆదేశించారు. జిల్లాలో సింగిల్ విండో కింద ధరఖాస్తు చేసుకున్న 52 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల్లో 51 మంది పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేస్తూ సమావేశం ఆమోదం తెలిపింది. మిగిలిన ఒక ధరఖాస్తుకు సంబంధించి లీగల్ అండ్ మెట్రాలజీ వారివద్ద పెండింగ్ లో ఉండటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సరైనరీతిలో స్పందించని అధికారికి షోకాజ్ నోటీసు జారీచేయాలని ఆదేశించారు. పరిశ్రమల అభివృద్ధి పాలసీని అనుసరించి ఆరు పరిశ్రమలకు రూ. 44.66 లక్షలు ప్రోత్సాహకాలుగా మంజూరుకు సమావేశం ఆమోదం తెలిపింది. ఆటోనగర్ సంబంధించి కోర్టుకేసుకు సంబంధించి జిపిని సంప్రదించాలని ఎపిఐఐసి జెడ్ఎం ను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, డిఆర్డిడిఏ పీడీ ఆర్. విజయరాజు, ఎల్డిఎమ్ డి. నీలాద్రి, ఎపిఐఐసి జెడ్ఎం కె. బాబ్జి, ఉధ్యానశాఖ డిడి ఎస్. రామ్మోహన్,కార్మిక శాఖ ఉప కమీషనర్ పి. శ్రీనివాస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ వెంకటేశ్వర రావు,జిల్లా ఫైర్ ఆఫీసర్ సిహెచ్ రత్నబాబు , సోషల్ వెల్ఫేర్ జెడి యం.ముక్కంటి, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉభయ గోదావరి
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

# చేతివృత్తుల పనివారి పాట్లు



**పోలవరం, జూన్ 3(తెలుగు రాష్ట్రం విలేకరి):** గతంలో సంతకో, మార్కెట్ కో వెళితే చేతి సంచులు, వెదురు బుట్టలో తీసుకువెళ్ళవలసి వచ్చేది. నేడు మార్కెటింగ్ షాపింగ్ కర్రీపాయింట్ నుండి కర్రీ లేదా రెస్టారెంటు నుండి బిర్యానీ కూరగాయలషాపుకెళితే క్యారీ బ్యాగులు సర్వసాధారణమైపోయాయి. ప్లాస్టిక్ వినియోగం ఎంతలా పెరిగిపోయిందంటే ఏ ఇంట్లో ఎక్కడ చూసినా క్యారీబ్యాగులే దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ వినియోగం వలన క్యాన్సర్ వంటి భయంకర అనారోగ్య సమస్యలే కాకుండా పర్యావరణం కూడా పూర్తిగా ప్లాస్టిక్ భరితంగా మారి కలుషితమవుతుంది. ఈ ప్లాస్టిక్ వినియోగం ప్రత్యక్షంగా పర్యావరణాన్ని, ప్రజానీకాల ఆరోగ్యాన్నే కాకుండా చేతి వృత్తుల వారి ఉపాధికి కూడా చేటుగా మారింది. గతంలో కూరగాయలు ఇతర మార్కెటింగ్ సామాన్లు తెచ్చుకోవడానికి మేదర వృత్తుల వారు అల్లిన తాటాకు బుట్టలు, వెదురు బుట్టలు, వినియోగించేవారు, బియ్యం బాగుచేసుకోవడానికి వెదురు చేటలు, భోజనాలకు అడ్డాకులతో చేసిన విస్తరాకులు, తామరాకులు, అరిటాకులు, ఇల్లు ఊడ్చుకోవడానికి కొబ్బరి చీపుర్లు, ఇంట్లో బూజులు దులుపుకోవడానికి ఈత ఆకుల బూజు కర్రలు, పడుకోవడానికి ఈత, తుంగ చాపలు వినియోగించేవారు. వీటి వాడకం వలన ఎలాంటి పర్యావరణ సమస్యలు అనారోగ్య సమస్యలు ఉండేవి కావు. వీటి వాడకం ఒక ఏడాది కాలం కంటే ఎక్కువ కాలం ఉండక పోవడం వలన వాటి స్థానాన్ని ప్లాస్టిక్ వస్తువులు ఆక్రమించడంతో చేతి వృత్తులవారికి చేటు కాలంగా మారి ఉపాధి కోల్పోయారు. ప్లాస్టిక్ చేటలు, బూజు కర్రలు చీపుర్లు, చాపలు, బుట్టలు, భోజనం చేసే ప్లేట్లు, మంచినీరు తాగే గ్లాసులు, ఆహారపదార్థాలు తీసుకెళ్ళడానికి ప్లాస్టిక్ కవర్లు, క్యారీ బ్యాగులు వినియోగం పెరిగిపోయింది. వేడి వేడి ఆహారపదార్థాలు కూరలు, టీలు, కాఫీలు, టిఫిన్లు, సాంబారు తదితర నిత్యావసరాలు ప్లాస్టిక్ కవర్లలో తీసుకువెళ్ళడంతో పాటు ప్రజానీకం క్యాన్సర్ వంటి భయానక రోగాలను కూడా ఇంటికి తీసుకువెళుతున్నారు. ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోయి చేతివృత్తుల పనివారికి ఉపాధి లేకపోవడం వలన ఉపాధి మార్గాల కోసం ఇతర ప్రాంతాలకు చేతివృ త్తుల పనివారైన మేదర ఇతర కులాల చేతివృతులవారు వలసపోతున్నారు. భవన నిర్మాణ కార్మికులుగా, వ్యవసాయ కూలీలుగా ఇతర ఉపాధి పనులకు వెళుతున్నారు. అధికారులు స్పందించి తమకు పిఎం విశ్వనాధం, పిఎం విశ్వకర్మ పథకాలలో రుణాలు ఇప్పించి చేతివృత్తుల వారికి ఉపాధి కల్పించాలని అంతరించిపోతున్న చేతివృత్తులను కాపాడాలని కోరుతున్నారు.

## మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు శివాజీ విగ్రహావిష్కరణకు ఆహ్వానం



**జగ్గయ్యపేట, జూన్ 3 (తెలుగురాష్ట్రం విలేకరి):** జగ్గయ్యపేట పట్టణంలోని దుర్గాపురం, తొర్రకుంటపాలెం ప్రాంతంలో ఏర్పాటుచేసిన చత్రపతి శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహ ఆవిష్కరణలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర వైద్య విద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కు శివాజీ విగ్రహ కోర్ కమిటీ ప్రతినిధులు ఆహ్వానాన్ని అందజేశారు. మంగళవారం విజయవాడ సెక్రటేరియట్ లో మంత్రి చాంబర్లో రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ ను విగ్రహ కమిటీ ప్రతినిధులు నోముల రఘు, పిన్నం వెంగళరావు, పబ్బతి నరేంద్ర, సంక భాస్కర్, అల్లి రవిచంద్, జగ్ తాప్ విష్ణువర్ధన్ లు కలసి ఈనెల తొమ్మిదో తారీకు చత్రపతి శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహం ఆవిష్కరణలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమారులను శాలువాతో ఆత్మీయ సన్మానం నిర్వహించి శివాజీ మహారాజ్ మెమొంటోను అందజేశారు.

## రోడ్డు వైండింగ్ బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం

**-ఎమ్మెల్యే శిరీష దేవి**



**రంపచోడవరం, జూన్3 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** డివిజన్ పరిధిలో ఆర్%డ% బి జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా వీధుల పాలైన బాధితులను కూటమి ప్రభుత్వం న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్ ను మంగళగిరి పార్టీ కార్యాలయంలో మంగళవారం నాడు నియోజక వర్గ ఎమ్మెల్యే శిరీష దేవి, తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్ కోరారు. అందులో ముఖ్యంగా రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల్లో నష్టపోయిన బాధితులకు 3 సెంట్లు స్థలం చొప్పున ప్రత్యామ్నాయంగా ఇవ్వాలని కోరారు. అలాగే గంగవరం, రాజవొమ్మంగి, అడ్డతీగల మండలాల్లో కూల్చివేతలు ఇంకా ప్రారంభం కాలేదు కాబట్టి ఇప్పటికే 516ఇ జాతీయ రహదారి పనుల్లో నష్ట పోయి ఉన్నారు కాబట్టి వాటిని నిలుపుదల చేయాలని కోరారు. సదరు విషయం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తో చారవాణిలో మాట్లాడి ఆక్రమణలు కూల్చివేత నిలిపివేయాలని కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కాబట్టి బాధితులు ఎవరూ అధైర్యపడకుండా ఉండాలని కోరారు.

## ఆక్రమణ చెరలో కొత్తూరు చెరువు



**పోలవరం, జూన్ 3(తెలుగు రాష్ట్రం విలేకరి):** పోలవరం పంచాయతీ కొత్తూరు చెరువు ఆక్రమణలకు గురైందని నీటి వినియోగదారుల సంఘం ఆరోపించింది. తక్షణమే సర్వే చేయాలని కోరుతూ సోమవారం తహశీల్దార్ సాయి రాజుకు సంఘం అధ్యక్షుడు పాదం ప్రసాద్ వినతిపత్రం అందజేశారు. మొదటి తూము నుంచి కుంట కొమ్ముకు నీరు వెళ్లే మార్గం మీద పట్టా భూములు వచ్చాయని, అందుకే ఆరుతడి పంటలకు నీరు అందడం లేదన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు సర్వే చేయాలని బాదం ప్రసాద్ అన్నారు.

## ప్రజలు యోగాంధ్ర సద్వినియోగపరుచుకోవాలి

**-ఐటీడీఏ పీవో కట్ట సింహాచలం**



**రంపచోడవరం, జూన్3 (తెలుగు రాష్ట్రం విలేకరి):** ఏజెన్సీలోను ప్రజలు యోగాంధ్రను సద్వినియోగాపరచుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఈ నెల నాలుగో తారీఖు ఉదయం 6 గంటల నుండి ఏజెన్సీ గంగవరం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమంలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఏజెన్సీ మారుమూల గ్రామాల నుండి అన్ని మండలాలకు సంబంధించిన యువతి యువకులు వివిధ ప్రజాప్రతినిధులు యోగాంధ్ర సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

## బిజెపి రైతు సదస్సును జయప్రదం చేయండి



**చింతూరు, జూన్ 3 (తెలుగురాష్ట్రం విలేకరి):** ఈ నెల 8న ఏఎస్ఆర్ జిల్లా బిజెపి కిషన్ మోర్చా జిల్లా స్థాయి సదస్సు కూనవరం మండలం టేకుల బోరులోని ఉదయభాస్కర్ సినిమా హాలు ప్రాంగణంలో జరుగుతుంది. ఈ సదస్సుకి కిషన్ మోర్చా రాష్ట్ర నాయకులు చిగురుపాటి కుమారస్వామి, అధ్యక్షులు పాకాలపాటి రవిరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బిజెపి ఏఎస్ఆర్ జిల్లా కార్యదర్శి మఠం శాంతకుమారి, ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ సోల్లా బొజ్జి రెడ్డి హాజరవుతున్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భారతీయ జనతా పార్టీ కిషన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నోముల వెంకట రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం వెంకయ్య, కారం ధారయ, అసెంబ్లీ కో కన్వీనర్ నోముల సత్యనారాయణ, జిల్లా కిషోర్ మోర్చా ప్రధాన కార్యదర్శి కరక పవన్ కుమార్ మండల పార్టీ అధ్యక్షులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గోదావరిలో పడి చనిపోయిన బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం




**పి. గన్నవరం, జూన్ 3 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** నాగులంక గ్రామంలో స్నానానికి వెళ్లిన ఇద్దరు చిన్నారులు సానబోయిన సూర్యతేజ, కేతా ప్రవీణ్ గోదావరిలో మునిగి మృతి చెందారు. ఈ విషాదకర ఘటనపై వెంటనే స్పందించిన పి.గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను వారి కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా ప్రభుత్వం వెంటనే స్పందిస్తూ ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. గత సంవత్సరం ఉడుముడి వద్ద జరిగిన ప్రమాదంలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయాన్ని అందించడం, బోటు ప్రమాదంలో మరణించిన కుటుంబానికి కూడా ఆర్థిక సహాయం చేయడంతో పాటు వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించడం వంటి ఘటనలు ఇందుకు ఉదాహరణగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రజల పట్ల ప్రభుత్వ తక్షణ స్పందన, బాధ్యత గల వైఖరి ప్రతి సంఘటనలో కనిపిస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రహదారి భద్రత గురించి వివరించిన ఆర్టీవో మదన్ ఆలీ



**టీ.నర్సాపురం, జూన్3 (తెలుగురాష్ట్రం విలేఖరి):** టీ. నర్సాపురంలో మోటార్ సైకిల్, ఆటో, ట్రక్, ట్రాక్టర్, మొదలగున్నవి నడిపేవారిని మంగళవారం నిలిపి వారికి రహదారి భద్రత గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మదన్ అలీ మాట్లాడుతూ..ముఖ్యంగా టీ నర్సాపురం మండలంలో 14 15 సంవత్సరాలు కూడా లేని పిల్లలు కూడా డ్రైవింగ్ చేస్తుంటే ఆశ్చర్యంగా ఉందని అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.లైసెన్సు లేని వ్యక్తులు చాలామంది మోటార్ సైకిల్ తో పాటు ట్రాక్టర్లు కూడా అతివేగంగా వెళ్లటం దృష్టికి వచ్చిందని మంగళవారం రోడ్డుపై వాహనాలపై డ్రైవింగ్ చేస్తూ ప్రయాణిస్తున్న వారిని ఆపి వారికి కౌన్సిలింగ్ ఇవ్వటం జరిగినదని వివరించారు. ముఖ్యంగా హెల్మెట్ డ్రైవింగ్ లైసెన్స్ ఇన్సూరెన్స్ ముఖ్యమైన పత్రాలు గురించి వివరించి చెప్పారు. ముఖ్యంగా వ్యవసాయానికి ఉపయోగపడే మట్టి ఇసుక ట్రాక్టర్లపై రవాణా నిర్వహించే వారు లైసెన్స్ కలిగి ఇన్సూరెన్స్ పత్రాలు కూడా సరిగా ఉన్నాయా లేదో పరిశీలించి వెళ్లాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలపై గారాబంతో వాహనాలు ఇస్తున్నారు అటువంటి చేయకూడదని సూచించారు. అలా చేయటం వల్ల పిల్లలతో పాటు పెద్దల వారికి కూడా శిక్ష అనుభవించాలని హెచ్చరికలు జారీ చేశారు. మొట్టమొదటి తప్పుగా ఈరోజు ఆపిన మోటార్ సైకిల్ కి ఎటువంటి జరిమానా విధించడం లేదని నెక్స్ట్ టైం మాత్రం భారీగా జరిమానా తో పాటు కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి. జంగారెడ్డిగూడెం సీనియర్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎస్ఎస్ రంగనాయకులు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఇరువైపులా పాసెంజర్లను కూర్చోబెట్టుకుని ప్రయాణం చేయకూడదని, మద్యం సేవించి వాహనమును నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని సూచించారు. వెహికల్ ఇన్స్పెక్టర్. వై సురేష్ బాబు మాట్లాడుతూ సెల్ ఫోన్ మాట్లాడుతూ ఆటో నడపరాదని అతివేగం ప్రమాదకరమని రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానం చేరాలని సూచించారు.

## కాలనీ సమస్యలు మంత్రి సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్లిన టిడిపి పార్లమెంట్ కార్యదర్శి ముప్వ శ్రీనివాస్



**ఎటపాక, జూన్ 3 ( తెలుగు రాష్ట్రం విలేఖరి):** రాజుపేట కాలనీలో ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలను టిడిపి అరకు పార్లమెంట్ కార్యదర్శి ముప్వ శ్రీనివాస్ ఇటీవల జిల్లా ఇన్చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, మంత్రి ఆదేశాలతో చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్, ఆయా శాఖల అధికారులతో కలిసి మంగళవారం రాజుపేట కాలనీలో కాలినడకన తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు ముప్వ శ్రీనివాస్, రాజుపేట కాలనీలో ముఖ్యంగా ప్రజలు ఎదుర్కొంటున్న తెలంగాణ – ఆంధ్ర సరిహద్దు విద్యుత్ సమస్య, రహదారులు, త్రాగునీటి సమస్యలను పిఓ దృష్టికి తీసుకెళ్లగా ఆయా శాఖల అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. త్వరితగతిన ఆయా సమస్యల పట్ల పరిష్కారం చూపుతామని పిఓ తెలియజేశారు. దాంతో రాజుపేట కాలనీ ప్రజలు, నాయకులు ముప్వ శ్రీనివాస్ ఐటిడిఎ పిఓ అపూర్వ భరత్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ కాక కామేశ్వరి, తహసిల్దార్ కారం సుబ్బారావు, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఎటపాక సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ ఎర్రయ్య, ఎలక్ట్రికల్ జేఈ పరశురాం, లైన్ మెన్ శంకర్, మాజీ జెడ్పిటిసి గోడేటి రవికుమార్, పసుపులేటి రాంబాబు, కోడి కాంతారావు, సుకోరాం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అట్టహాసంగా ఐపీఎల్ ముగింపు వేడుకలు..
## త్రివర్ణ శోభితమైన స్టేడియం

ఐపీఎల్ 18వ సీజన్ ముగింపు వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మరికాసేపట్లో ఫైనల్ జరుగనున్నందున అహ్మదాబాద్‌లోని నరేంద్రమోడీ స్టేడియం త్రివర్ణ శోభితమైంది. 'ఆపరేషన్ సిందూర్'కు ప్రతీకగా గగనతలంపై వైమానిక దళాలు మువ్వన్నెల జెండాను ప్రదర్శిస్తూ అభిమానుల్లో జోష్ నింపాయి. స్వరమాంత్రికుడు శంకర్ మహదేవన్ బృందం సైతం దేశభక్తి పాటలతో స్టేడియాన్ని హెూరెత్తిస్తున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి మహదేవన్, ఆయన కుమారులు భారత సైనికుల కీర్తిని చాటే గేయాలను ఆలపిస్తూ ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్నారు. నత్యకారులు సైతం మూడు రంగుల దుస్తులు ధరించి స్టెప్పులు వేస్తూ ఆకట్టుకుంటున్నారు. ఇక స్టేడియంలోని అభిమానులు అయితే.. జాతీయ పతాకాన్ని చేతబూని.. జై హింద్, జై భారత్ నినాదాలతో సందడి చేస్తున్నారు.




**200 ప్లస్ స్కోర్..**

ఐపీఎల్ ఫైనల్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. మరికొన్ని గంటల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ మధ్య అహ్మదాబాద్‌లో మెగా ఫైట్ జరుగనుంది. రెండింటో ఎవరు గెలిచినా కొత్త ఛాంపియన్ అవతరించినట్టే. సో.. విజేతగా నిలిచేది ఎవరు? అనేది అభిమానుల్లో ఉత్కంఠ రేపుతోంది. ఈ సమఉజ్జీల పోరాటంలో 200 ప్లస్ స్కోర్ నమోదవ్వడం ఖాయం అనిపిస్తోంది. ఎందుకంటే.. క్వాలిఫయర్ 2లో ముంబై ఇండియన్స్ 203 రన్స్ కొట్టింది. భారీ ఛేదనలో శ్రేయాస్ అయ్యర్ మెరుపు హాఫ్ సెంచరీతో పంజాబ్ 11 ఏళ్ల తర్వాత ఫైనల్‌కు దూసుకెళ్లింది. అటు ఆర్సీబీకి ఇది నాలుగో ఫైనల్. కాబట్టి.. కప్ ముద్దాడేందుకు.. ఛాంపియన్ అనిపించుకునేందుకు ఇరుజట్ల ఆటగాళ్లు ప్రాణం పెట్టి ఆడాల్సి ఉంటుంది.ం

# జేమీసన్‌కు రెండో వికెట్..
## భారీ స్కోర్ భారమంతా కోహ్లీపైనే..!



ఐపీఎల్ ఫైనల్లో పంజాబ్ కింగ్స్ పేసర్ కైలీ జేమీసన్(2-25) హడలెత్తిస్తున్నాడు. ఆదిలోనే డేంజరస్ ఫిల్ సాల్ట్(16)ను ఔట్ చేసిన ఈ పొడగరి స్పీడ్‌స్టర్.. ఆర్సీబీ సారథి రజత్ పాటిదార్(26)ను వెనక్కి పంపాడు. సిక్సర్ బాదిన అతడికి షాకిస్తూ యార్కర్ సంధించిన జేమీసన్ ఎల్బీగా వికెట్ సాధించాడు. దాంతో, 40 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. 96 రన్స్ వద్ద బెంగళూరు మూడో వికెట్ పడింది. కీలక వికట్లు పడడంతో జట్టుకు భారీ స్కోర్ అందించే బాధ్యత విరాట్ కోహ్లీ(32)పై పడింది. యాంకరింగ్ రోల్ పోషిస్తున్న కోహ్లీకి అండగా లివింగ్‌స్టోన్(3) క్రీజులో ఉన్నాడు. 12 ఓవర్లకు స్కోర్.. 103-3. ఐపీఎల్ ఫైనల్లో టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్‌కు బిగ్ బ్రేక్ లభించింది. ఆర్సీబీ డేంజరస్ ఓపెనర్ ఫిల్ సాల్ట్()ను జేమీసన్ ఔట్ చేశాడు. రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో జోరు మీదున్న సాల్ట్‌ను ఊరించే బంతితో బోల్తా కొట్టించాడీ పేసర్. లాంగాఫ్‌లో అతడు గాల్లోకి లేపిన బంతిని గమనిస్తూ వెనక్కి పరుగెత్తిన శ్రేయాస్ అయ్యర్ ఒడుపుగా క్యాచ్ అందుకున్నాడు. దాంతో, 18 వద్ద తొలి వికెట్ పడింది. సాల్ట్ ఔటయ్యాక విరాట్ కోహ్లీ(32 నాటౌట్), మయాంక్ అగర్వాల్(24) మరో వికెట్ పడకుండా.. రన్ రేటు తగ్గకుండా చూసుకుంటూ ఆడారు. దాంతో పవర్ ప్లేలో ఆర్సీబీ వికెట్ స్కోర్ చేసింది. రెండో వికెట్‌కు 38 రన్స్ జోడించిన మయాంక్‌ను చాహల్ వెనక్కి పంపాడు. ఆ తర్వాత రజత్ పాటిదార్(26)ధనాధన్ ఆడుతూ స్కోర్ బోర్డును ఉరికించాడు. కోహ్లీతో కలిసి స్కోర్ వంద దాటించాడు. మూడో వికెట్‌కు 27 బంతుల్లోనే 40 రన్స్ రాబట్టిన పాటిదార్‌ను జేమీసన్ ఎల్బీగా ఔట్ చేసి పంజాబ్‌కు మరోసారి బ్రేకిచ్చాడు.

# అయ్యర్ సూపర్ క్యాచ్..
## ఆర్సీబీ డేంజరస్ ఓపెనర్ ఔట్



ఐపీఎల్ ఫైనల్లో టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్‌కు బిగ్ బ్రేక్ లభించింది. ఆర్సీబీ డేంజరస్ ఓపెనర్ ఫిల్ సాల్ట్(16)ను జేమీసన్ ఔట్ చేశాడు. రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో జోరు మీదున్న సాల్ట్‌ను ఊరించే బంతితో బోల్తా కొట్టించాడీ పేసర్. లాంగాఫ్‌లో అతడు గాల్లోకి లేపిన బంతిని గమనిస్తూ వెనక్కి పరుగెత్తిన శ్రేయాస్ అయ్యర్ ఒడుపుగా క్యాచ్ అందుకున్నాడు. దాంతో, 18 వద్ద తొలి వికెట్ పడింది. ప్రస్తుతం విరాట్ కోహ్లీ(13), మయాంక్ అగర్వాల్(24) మరో వికెట్ పడకుండా.. రన్ రేటు తగ్గకుండా చూసుకుంటూ ఆడుతున్నారు. పవర్ ప్లేలో ఆర్సీబీ స్కోర్.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీకి సాల్ట్(16) మెరుపు ఆరంభమిచ్చాడు. అర్ష్‌దీప్ సింగ్ వేసిన తొలి ఓవర్లో సిక్స్, ఫోర్ బాదిన అతడు 13 రన్స్ పిండుకున్నాడు. అనంతరం జేమీసన్ ఓవర్లో బౌండరీతో విరుచుకుపడ్డాడు. కానీ, నాలుగో బంతిని సిక్సర్‌గా మలిచే క్రమంలో అయ్యర్ చేతికి చిక్కాడు.ఆదిలోనే తొలి వికెట్ కోల్పోయిన జట్టును విరాట్ కోహ్లీ(13), మయాంక్(24)లు ఆదుకునే పనిలో ఉన్నారు. అర్ష్‌దీప్ వేసిన 3 వ ఓవర్ చివరి బంతికి మయాంక్ సిక్సర్ కొట్టగా ఆర్సీబీ స్కోర్ 30కి చేరింది. ఆ తర్వాత జేమీసన్‌కు చుక్కలు చూపిస్తూ రెండు ఫోర్లు బాదాడు. అయితే.. పంజాబ్ ఫీల్డర్లు బౌండరీలను అడ్డుకుంటూ స్కోర్ బోర్డు వేగానికి కళ్లెం వేస్తున్నారు.



# ఐదు వేదికల్లో మహిళల ప్రపంచకప్



## కొలంబోలో పాకిస్థాన్ మ్యాచుల షెడ్యూల్

**న్యూఢిల్లీ :** ఐసీసీ 2025 మహిలల వన్డే వరల్డ్‌కప్ వేదికలు ఎట్టకేలకు ఖరారు అయ్యాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 2 వరకు జరుగనున్న ప్రపంచకప్‌కు బెంగళూర్, గువహటి, విశాఖపట్నం, ఇండోర్ సహా శ్రీలంకలోని కొలంబో ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఐసీసీ వరల్డ్‌కప్‌కు భారత్ ఆతిథ్యం ఇస్తుండగా.. బీసీసీఐ, పీసీబీ ఒప్పందం ప్రకారం హైబ్రిడ్ మోడల్‌లో పాకిస్థాన్ జట్టు మ్యాచులను పూర్తిగా కొలంబోలో షెడ్యూల్ చేశారు. నవంబర్ 2న ఫైనల్ మ్యాచ్‌ను బెంగళూర్‌లోని చిన్నస్వామి స్టేడియంలో షెడ్యూల్ చేయగా.. ఒకవేళ పాకిస్థాన్ ఫైనల్‌కు చేరుకుంటే టైటిల్ పోరు కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరుగుతుంది. పూర్తి షెడ్యూల్ విడుదల చేయకపోయినా.. ఆరంభ, ముగింపు తేదిలు సహా వేదికలను ఖరారు చేశారు. 2025 ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో ఎనిమిది జట్లు పోటీపడుతున్నాయి. ఆతిథ్య భారత్ సహా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లు టైటిల్ వేటలో నిలువనున్నాయి. సెప్టెంబర్ 30న బెంగళూర్‌లో ఆరంభ మ్యాచ్ జరుగనుండగా.. ఆతిథ్య భారత్ తొలి మ్యాచ్‌లో ఆడనుంది. అక్టోబర్ 29న తొలి సెమీఫైనల్‌కు గువహటి లేదా కొలంబో.. అక్టోబర్ 30న రెండో సెమీఫైనల్‌కు బెంగళూర్ వేదికగా నిలువనున్నాయి. విశాఖపట్నం టోర్నమెంట్ తొలి మ్యాచ్‌కు వేదికగా నిలుస్తుందని భావించినా.. గ్రూప్ దశ మ్యాచులకు మాత్రమే ఆతిథ్యం ఇవ్వనుంది. ఇదిలా ఉండగా, 2026 మహిళల టీ20 ప్రపంచకప్ ఇంగ్లాండ్‌లో జరుగనుండగా.. జూన్ 12-జులై 5 వరకు టోర్నమెంట్ షెడ్యూల్ చేశారు. జులై 5న ఫైనల్‌కు లార్డ్స్ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. టీ20 ప్రపంచకప్‌లో 12 జట్లు పోటీపడనుండగా..24 రోజుల్లో 33 మ్యాచులు ఏడు వేదికల్లో జరుగుతాయి. ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, భారత్, పాకిస్థాన్, శ్రీలంక, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ సహా డిఫెండింగ్ చాంపియన్ న్యూజిలాండ్ 2026 టీ20 ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించాయి. ఇతర నాలుగు జట్లను వచ్చే ఏడాది అర్హత టోర్నమెంట్‌లో తేల్చనున్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక




# ప్రభాస్ నటిస్తున్న రాజాసాబ్ నుంచి బిగ్ అప్డేట్..

ప్రభాస్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ ది రాజాసాబ్ నేడు మేకర్స్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా మేకర్స్ అధికారిక పోస్టర్ రిలీజ్ చేశారు. డైరెక్టర్ మారుతీ తెరకెక్కిస్తున్న ఈ హార్రర్ కామెడీ మూవీ.. 2025 డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని మేకర్స్ తెలిపారు. ఈ మేరకు రిలీజ్ చేసిన పోస్టర్ పవర్ ఫుల్?గా ఉంది. ఇప్పటివరకు వచ్చిన ప్రతి పోస్టర్ దేనికదే డిఫరెంట్ అనే విధంగా ఇంపాక్ట్ పెంచేతున్నాయి. ఈ లేటెస్ట్ పోస్టర్?లో కాలుతున్న నోట్ల కట్టల మధ్యలో గంభీరమైన లుక్?లో ప్రభాస్ నిల్చున్నాడు. ఇది రెబల్ ఫ్యాన్స్?ను వీపరీతంగా ఆకట్టుకునేలా చేసింది .

# గ్లామరస్‌గా నటిస్తే తప్పేంటి..?

**సోషల్ మీడియాలో నెగెటివ్ కామెంట్లపై మాళవిక మీనన్ ఫైర్**

సినిమాల్లో గ్లామరస్ గా నటిస్తే తప్పేంటని మలయాళ నటి మాళవిక మీనన్ ఎదురు ప్రశ్నిస్తోంది. ఇటీవల సోషల్ మీడియాలో గ్లామరస్ ఫొటోలు షేర్ చేస్తూ యువతకు నిద్ర లేకుండా చేస్తున్న మాళవిక.. తనపై నెగెటివ్ ప్రచారం చేసే వారిని పట్టించుకోనని చెప్పింది. ఎక్స్ పోజింగ్ విషయంలో చాలామంది హీరోయిన్లు ఉదారంగా ఉంటున్నారని తెలిపింది. తాను ఒక్కదాన్నే గ్లామర్ గా నటించడంలేదని, మిగతా హీరోయిన్లు కూడా బాడీ షో చేస్తున్నారని గుర్తుచేసింది. తమిళ, మలయాళ భాషల్లో చిత్రాలతో బిజీగా ఉన్న మాళవిక కోలీవుడ్‌లోనూ అవకాశాలు అందిపుచ్చుకుంటోంది. తెలుగులో 'అమ్మాయిలు అంతే అదో టైపు', 'వందనం' వంటి చిత్రాల్లో నటించినా పెద్దగా ఫేమ్ రాలేదు. దీంతో, ఓవైపు తెలుగు ఇండస్ట్రీలో అవకాశాల కోసం ప్రయత్నిస్తూనే మలయాళ ఇండస్ట్రీపై మాళవిక ఫోకస్ పెట్టింది. తన ఇన్ స్టాలో మాళవిక షేర్ చేస్తున్న ఫొటోలు వైరల్ గా మారుతున్నాయి. ఈ ఫొటోలు చూసి నెటిజన్లు నటిపై ఫైర్ అవుతున్నారు. అవకాశాల కోసమే ఇలా ఎక్స్ పోజ్ చేస్తున్న ఫొటోలను షేర్ చేస్తోందని కామెంట్లు పెడుతున్నారు. ఈ కామెంట్లపై మాళవిక తాజా ఇంటర్వ్యూలో స్పందించింది. 'అవకాశాల కోసమే ఫొటోలు షేర్ చేయడం లేదు. అయినా గ్లామర్‌గా నటించడంలో తప్పేముంది. నా గురించి ఉన్నవీ లేనివీ ప్రచారం చేసే వారి గురించి పట్టించుకోవాల్సిన అవసరం నాకు లేదు. నాలాగే చాలామంది హీరోయిన్లు గ్లామర్ పాత్రల్లో నటిస్తున్నారు" అని చెప్పుకొచ్చింది.



# నెట్ ఫ్లిక్స్‌లో వరలక్ష్మి శరత్ కుమార్ హారర్ థ్రిల్లర్!

**2022లో థియేటర్లకు వచ్చిన సినిమా**
**జానపద కథను తలపించే కంటెంట్**
**కామెడీ టచ్ తో సాగే హారర్ థ్రిల్లర్**
**వరలక్ష్మి శరత్ కుమార్ ఎపిసోడ్ హైలైట్**



హారర్ థ్రిల్లర్ జోనర్ కి ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పై ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఈ జోనర్ నుంచి కొత్తగా ఎప్పటికప్పుడు కొత్త కంటెంట్ దిగిపోతూనే ఉంటుంది. ఒకవేళ కొత్తగా ఈ జోనర్ నుంచి ఏ సినిమా రాకపోయినా, గతంలో వచ్చిన హారర్ థ్రిల్లర్స్ లో ఏది ఎక్కువగా కనెక్ట్ అవుతుతుందనేది సెర్చ్ చేస్తూ వెళతారు. అలాంటి వారికి కామెడీ టచ్ తో సాగే తమిళ హారర్ థ్రిల్లర్ ఒకటి నచ్చే అవకాశాలు ఉన్నాయి. తెలుగులోనూ అందుబాటులో ఉన్న ఆ సినిమా పేరే 'కట్టేరి' .. అంటే 'రక్తపిశాచి' అని అర్థం. జ్ఞానవేల్ రాజా - ఎస్ ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమాకి, డీకే దర్శకత్వం వహించాడు. ఎస్ ఎన్ ప్రసాద్ నేపథ్య సంగీతాన్ని అందించిన ఈ సినిమా, 2022 ఆగస్టులో థియేటర్లకు వచ్చింది. థియేటర్స్ నుంచి ఓ మాదిరి రెస్పాన్స్ ను రాబట్టుకున్న ఈ సినిమా, ఆ తరువాత ఓటీటీ వైపుకు వచ్చింది. అలా ఓటీటీలో అడుగుపెట్టినప్పుడు ఎంతమంది చూశారోగానీ, ఈ మధ్య కాలంలో ఈ సినిమాను ఎక్కువ మంది చూస్తూ వెళుతుండటం గమనించవలసిన విషయం. వరలక్ష్మి శరత్ కుమార్ ఎపిసోడ్ ఈ సినిమాకి హైలైట్ అంటున్నారు. కథ విషయానికి వస్తే .. అది అడవికి ఆనుకుని ఉన్న ఒక గ్రామం. ఆ విలేజ్ లో మత్తమ్మ (వరలక్ష్మి శరత్ కుమార్) ఆమె చెల్లెలు కలిసి నివసిస్తూ ఉంటారు. ఆ ఇంటి పెరటిలో ఒక పెద్ద బావి ఉంటుంది. ఆ బావిలో ఒక రక్తపిశాచి ఉంటుంది. ఆ పిశాచికి ఆహారంగా ఆ బావిలోకి ఎవరినైనా తోసేస్తే ఆ ఎత్తు బంగారాన్ని ఆ పిశాచి పైకి పంపుతూ ఉంటుంది. ఈ విషయం ఒక పోలీస్ ఆఫీసర్ కి తెలుస్తుంది. అప్పుడు ఏం జరుగుతుంది? ఆ నిధి కోసం ఆ ఊరికి చేరుకున్న హీరో బ్యాచ్ కి ఎలాంటి పరిస్థితి ఎదురవుతుంది? అనేది కథ.



# భిన్న కాన్సెప్ట్‌తో 'ఘాటి'

అనుష్క శెట్టి లీడ్‌రోల్‌లో క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన చిత్రం 'ఘాటి'. అనుష్క పుట్టినరోజున విడుదలైన గ్లింప్స్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. దీని తర్వాత తమిళ స్టార్ విక్రమ్ ప్రభు ఇంటెన్స్ అవతార్‌లో కనిపించిన క్యారెక్టర్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇది సినిమాపై ఉన్న బజ్‌ను మరింత పెంచింది. యువి క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సోమవారం మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ గురించి అప్‌డేట్ ఇచ్చారు. జూలై 11న ఈ సినిమా రిలీజ్ కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో అనుష్క, విక్రమ్ ప్రభు నదీ ప్రవాహంలో సంచులు మోసుకుంటూ వెళుతున్న విజువల్స్ ఇంటెన్స్ జర్నీని సూచిస్తున్నాయి. సక్సెస్ ఫుల్ మూవీ 'వేదం' తర్వాత అనుష్క శెట్టి, దర్శకుడు క్రిష్ కలిసిన చేస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ ప్రాజెక్ట్. అలాగే యువీ క్రియేషన్స్‌తో కలిసి అనుష్క నాలుగోసారి వర్క్ చేయడం మరో విశేషం. హై బడ్జెట్‌తో, అత్యున్నత స్థాయి సాంకేతిక ప్రమాణాలతో భారీ స్థాయిలో రూపొందుతున్న ఈచిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో సహా పలు భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: క్రిష్ జాగర్లమూడి, నిర్మాతలు: రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి, ప్రెజెంట్స్: యువీ క్రియేషన్స్, బ్యానర్: ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: మనోజ్ రెడ్డి కాటసాని, ఆర్ట్ డైరెక్టర్: తోట తరణి, సంగీతం: నాగవెల్లి విద్యాసాగర్, డైలాగ్స్: సాయి మాధవ్ బుర్రా, కథ: చింతకింది శ్రీనివాసరావు, ఎడిటర్: చాణక్య రెడ్డి తూరుపు, వెంకట్ ఎన్ స్వామి, యాక్షన్ కొరియోగ్రఫీ: రామ్ క్రిషన్.

# ఆసక్తికరంగా 'రానా నాయుడు సీజన్ 2' ట్రైలర్

**వెంకటేశ్, రానా ప్రధాన పాత్రలలో రూపొందిన వెబ్ సిరీస్**
**యువతను బాగా ఆకట్టుకున్న మొదటి సీజన్**
**తొలి భాగానికి కొనసాగింపుగా 'రానా నాయుడు: సీజన్ 2'**
**ఇందులో వినోదం, థ్రిల్లింగ్ అంశాలు**
**జూన్ 13 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్**

విక్టరీ వెంకటేశ్, రానా ప్రధాన పాత్రలలో రూపొందిన వెబ్ సిరీస్ రానా నాయుడు. మొదటి సీజన్ యువతను బాగా ఆకట్టుకోవడంతో ఇప్పుడు కొనసాగింపుగా 'రానా నాయుడు: సీజన్ 2' వస్తోంది. దీని కోసం అభిమానులు అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో రానా నాయుడు సీజన్ 2కి సంబంధించిన ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఇందులో వినోదం, థ్రిల్లింగ్ అంశాలు అంచనాలని పెంచేశాయి. 'రానా నాయుడు: సీజన్ 2'లో నాగ నాయుడుగా వెంకటేశ్ సందడి చేయనున్నారు. 'రానా నాయుడు: సీజన్ 2' మొత్తం యాక్షన్, డ్రామాతో నిండి ఉంటుంది. ఇది జూన్ 13 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. తొలి పార్ట్‌లో కాస్త బోల్డ్ కంటెంట్ ఉందని విమర్శలు వచ్చిన నేపథ్యంలో సీక్వెల్‌లో కాస్త దానిని తగ్గించారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషలలో ఇది విడుదల కానుంది. అర్జున్ రాంపాల్, సుర్వీన్ చావ్లా, కృతి కర్భంద, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, డినోమోరియా తదతరులు ఇందులో కీలక పాత్రలు పోషించారు. కాగా, రియల్ లైఫ్ లో బాబాయి, అబ్బాయిలు ఈ వెబ్ సిరీస్ లో తండ్రి తనయులుగా నటించిన విషయం తెలిసిందే. ఈ క్రేజీ సిరీస్‌ని కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ వర్మ, అభయ్ చోప్రా తెరకెక్కించగా... సుందర్ ఆరోన్, లోకోమోటివ్ గ్లోబల్ మీడియా నిర్మించింది.



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339